
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
సోమవారం, 16.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 144
పేజీలు: 12 వెల: రూ. 5

## నన్ను ఇన్వాల్వ్ చేయొద్దు
ప్రతి డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్‌ను లాగడం దారుణం: కేటీఆర్ 03





శ్రీవారి భక్తులకు
## హైటెక్ అన్నదానం
### రిలయన్స్ భారీ విరాళం
- రూ.120 కోట్లతో ఆధునిక వంటశాల నిర్మాణం.. 09
- రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నదాన కేంద్రం విస్తరణ
- వంట ప్రక్రియ, ప్రసాదాల పంపిణీలో ఆటోమేషన్‌కు శ్రీకారం
- తరిగొండ వెంకమాంబ అన్నప్రసాద కేంద్రం ఆధునికీకరణకు కీలక అడుగు

## లిక్కర్ కింగ్స్
### మద్యం తాగడంలో తెలంగాణ టాప్



- దక్షిణాదిలో తెలంగాణ ఫస్ట్, దేశంలో మూడో స్థానం
- ఒక్కో వ్యక్తి 4.4 లీటర్లు తాగుతున్న వైనం
- లిక్కర్ అమ్మకాలతోనే ఎక్కువ ఆదాయం
- రోజుకు రూ.90–110 కోట్ల వరకు లిక్కర్ అమ్మకాలు
- హైదరాబాద్ మెట్రో ప్రాంతంలోనే అధిక మద్యం విక్రయాలు
- 2024లో రాష్ట్రంలో రూ.37 వేల కోట్లకు పైగా లిక్కర్ సేల్స్

02


## గ్యారెంటీల బడ్జెట్ జ

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

గవర్నర్ ప్రసంగంతో ఉభయ సభలకు శ్రీకారం

- బడ్జెట్‌లో కొత్త సంక్షేమ పథకాలపై కీలక ప్రకటనలు?
- మహిళలకు నెలకు ₹2,500 పథకంపై స్పష్టత వచ్చే ఛాన్స్
- పెన్షన్లు ₹4,000కు పెంపుపై ప్రభుత్వం కసరత్తు
- రైతు సంక్షేమం, ఆరు గ్యారంటీలకు భారీ నిధులు?
- ప్రతిపక్షాల దాడికి కౌంటర్‌కు అధికార పార్టీ సిద్ధం
- అసెంబ్లీకి కేసీఆర్ హాజరు అవుతారా అన్న ఉత్కంఠ
- రైతులు, నిరుద్యోగుల సమస్యలపై సభలో చర్చ అవకాశం


**ముద్ర తెలంగాణ బ్యూరో:** సీఎం రేవంత్ మరో ఎన్నికల హామీ అమలు దిశగా కసరత్తు చేస్తున్నారు. కాంగ్రెస్ ఏర్పాటు అయిన తరువాత వరుసగా పథకాలను అందిస్తున్నారు. ఇప్పుడు, పెండింగ్ లో ఉన్న రెండు పథకాలను అమలుకు సిద్ధమవుతున్నారు. మహిళలకు రూ 2, 500, పెన్షన్లు 4 వేలకు పెంపు పైన ప్రకటనకు తుది కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టే బడ్జెట్ లో ప్రకటన దిశగా చర్చలు సాగుతున్నట్లు సమాచారం. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు ఉదయం 11:45 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ సారి అసెంబ్లీకి కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తొలిసారి రానున్నారు. గవర్నర్ ప్రసంగంతో ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి. పదిరోజుల పాటు సమావేశాలను నిర్వహించాలనే యోచనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉంది. సభ ప్రాంగణంలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ పై ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మిగతా 02లో




## కూతురి హత్య
కేకలు వేస్తూ బయటకు పారిపోయిన బాలుడు



- కుటుంబ కలహాల నేపథ్యంలో దారుణం
- తల్లిగారి ఇంట్లోనే జరిగిన ఘోరం
- అనంతరం ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం 03
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు




## ప్రైవేటుకు అబ్బాయిలు | సర్కారుకు అమ్మాయిలు!
### 21వ శతాబ్దంలోనూ లింగ వివక్ష

- పాఠశాల విద్యలో అసమానతలు
- వివక్ష ప్రదర్శిస్తున్న తల్లిదండ్రులు
- వెల్లడించిన 2026 యూ డైస్ నివేదిక

*అబ్బాయి అయితే ప్రైవేటు స్కూలు.. అమ్మాయి అయితే సర్కారు బడి! 21వ శతాబ్దంలోనూ ఇంకా వీడని మౌఢ్యం.. కొడుకు ఉజ్వల భవిష్యత్తు కోసం ఖర్చుకు వెనుకాడని అవే చేతులు.. కూతురి చదువును మాత్రం 'ఖర్చు'గా చూస్తున్నాయా? ఏడు రంగుల హరివిల్లులాంటి బాల్యానికి, తల్లిదండ్రుల నిర్ణయాలు అక్షరాల సాక్షిగా వివక్ష రంగును పులుముకుంటున్నాయి.* 09 -ముద్ర, గద్వాల :


రాత్రంతా బైక్ ఆన్..
## పొగ పీల్చి ఒకే ఇంట్లో నలుగురు మృతి
- ఊపిరాడక తాత, మనవళ్లు మృతి
- చిన్న తప్పు పెద్ద విషాదం 03
- అన్నమయ్య జిల్లాలో ఘటన



ఇందిరమ్మ లబ్ధిదారులకు
## గుడ్ న్యూస్
- ఇళ్ల నిర్మాణంలో ఉన్న వారికి నేరుగా ఖాతాల్లో నిధుల జమ
- మొత్తం 2,764 మంది లబ్ధిదారులకు రూ.28.50 కోట్ల విడుదల
- ఎల్-3 జాబితాలోని 1200 మందికి రూ.12.06 కోట్ల చెల్లింపు
- బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న 653 మందికి రూ.7 కోట్ల మంజూరు
- అభ్యంతరాల కారణంగా ఆగిన 911 మందికి రూ.9.40 కోట్ల విడుదల 09
- ఆగిన బిల్లుల క్లియరెన్స్‌కు ప్రత్యేక డ్రైవ్
- ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల జాబితా విడుదలకు కసరత్తు



## పైలట్ ఫాంహౌస్‌లో డ్రగ్ పార్టీ
మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మరో వివాదం



- డ్రగ్స్ పార్టీకి టీడీపీ ఎంపీ సహా 11 మంది అదుపులోకి
- పోలీసుల రాకతో కాల్పులు
- డ్రగ్ టెస్టుల్లో ఆరుగురికి పాజిటివ్ షాక్ 02
- గతంలో ఇదే ఫాంహౌస్ లో కొనుగోలు కేసు
- రాజకీయ నేతల డ్రగ్స్ పార్టీపై రాష్ట్రంలో సంచలనం

హైదరాబాద్ చుట్టూ
## రీజినల్ రింగ్ రైలు
### డీపీఆర్ సర్వేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రింగ్ రైలు ప్రణాళిక

- తొలుత 11 కిలోమీటర్లు
- రేవంత్ రెడ్డి సూచనలకు కేంద్రం సానుకూల స్పందన
- భూసేకరణ భారం తగ్గించేలా కొత్త అలైన్‌మెంట్
- హైదరాబాద్ శివారు జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుదల
- రింగ్ రోడ్–రింగ్ రైలు కలిస్తే అభివృద్ధికి ఊతం
- పారిశ్రామిక హబ్‌లకు దారి తీసే మెగా ప్రాజెక్టు
- సర్వే ప్రారంభంతో వేగంగా రింగ్ రైలు ప్రణాళిక

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ ప్రాజెక్టు డీపీఆర్ తయారు చేసేందుకు కావాల్సిన సర్వే చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక ఈ రింగ్ రైలును ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా ఉండేలా చూడాలని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. అన్ని అనుమతులు పూర్తైన తర్వాత ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి. ఈ ఆర్ఆర్ఆర్ మిగతా 02లో




## మిస్టర్ రంగనాథ్.. జాగ్రత్త
నీ పై పరువు నష్టం కేసు వేసి కోర్టుకు లాగుతా'

- హైడ్రా ఎక్స్ ఖాతాలో వీడియోలు వెంటనే తొలగించకపోతే చర్యలు 09
- హైడ్రా కమిషనర్‌కు కవిత వార్నింగ్
- వెలుగుమట్ల బాధితుల కోసం ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటన

## ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల నగారా
### షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం



- ఏప్రిల్ లో పోలింగ్.. మే 4న ఫలితాలు!
- తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో పోలింగ్‌కు ఏర్పాట్లు
- 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- ఈ 5 రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమలు
- ఆరు రాష్ట్రాల్లో ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు

10

## రైతులకు గుడ్ న్యూస్
### 22న రైతు భరోసా మొదటి విడత నిధులు
- నర్మెట్టలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- మొదటి విడతగా 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు జమ 10
- 20 రోజుల తర్వాత రెండో విడతగా మరో రూ.2,650 కోట్లు విడుదల
- ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడతతో నిధుల పంపిణీ పూర్తి
- మూడు విడతల్లో కలిపి సుమారు రూ.9 వేల కోట్లు



ఇదీ ఏఐ ముద్ర




రష్యా ప్రయోగిస్తున్న డ్రోన్లను కూల్చడంలో ఆరితేరిన ఉక్రెయిన్ ఇప్పుడు ఆ అనుభవాన్ని గల్ఫ్ దేశాలకు పంచుతోంది. దీనికి ప్రతిఫలంగా తమకు టెక్నాలజీ... నిధులు కావాలని జెలెన్‌స్కీ కోరారు. ఇప్పటికే ఖతర్, యూఏఈ, సౌదీకి నిపుణులను పంపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 16.03.2026
www.mudranews.in | @mudranews



### ప్రెషర్ కుకర్ వినియోగించండి



ప్రెషర్ కుకర్‌లో వండితే ఆహారం త్వరగా ఉడుకుతుంది. దీంతో గ్యాస్ వినియోగం గణనీయంగా తగ్గుతుంది.

# లిక్కర్ కింగ్స్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
మద్యం సేల్స్ రికార్డులు రాష్ట్రంలో ఆందోళన కల్గిస్తున్నాయి. ప్రభుత్వం కూడా మద్యం అమ్మకాల మీదే ఆధారపడుతోంది. మద్యం అమ్మకాలను విచ్చలవిడిగా ప్రోత్సహిస్తోంది. ఫలితంగా లిక్కర్ సేల్స్ గణనీయంగా పెరుగుతున్నాయి. తాజాగా మద్యం తాగడంలో దక్షిణాది రాష్ట్రాలలో తెలంగాణ ప్రజలు మొదటి స్థానంలో ఉన్నారు. ఒక్కో వ్యక్తి సగటున ఏడాదికి 4.4 లీటర్ల మద్యాన్ని తాగుతున్నారని నివేదికలు తెలుపుతున్నాయి. అలాగే ఒక వ్యక్తి ఏడాదికి మద్యం సగటు వినియోగం కర్ణాటక 4.2, తమిళనాడు 3.38 కాగా ఏపీ 2.7తో నాలుగవ స్థానంలో ఉంది. కేరళ 2.5 లీటర్లతో 5వ స్థానంలో ఉందని @IndianTechGuide హ్యాండిల్ పేర్కొంది.

**దేశవ్యాప్తంగా మద్యం వినియోగంలో మూడవ స్థానంలో తెలంగాణ**
దేశవ్యాప్తంగా మద్యం వినియోగంలో దక్షిణాది రాష్ట్రాలు టాప్‌లో ఉన్నాయి. మొదటి నాలుగు స్థానాలలో కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఏపీలే ఉండటం గమనార్హం. కర్ణాటకలో మద్యం వినియోగం అత్యధికంగా 6.88 కోట్ల కేసులు వినియోగించి టాప్‌లో ఉండగా, తమిళనాడు 6.47 కోట్ల కేసులు వినియోగించి రెండవ స్థానంలో తెలంగాణ 3.71 కోట్ల కేసులు వినియోగించి మూడవ స్థానంలో, ఏపీ 3.55 కోట్లు వినియోగించి నాలుగవ స్థానంలో నిలిచింది.




**తెలంగాణలో మద్యం పై భారీ ఖర్చు**
తెలంగాణ ప్రజలు మద్యంపై ఖర్చు కూడా ఎక్కువగానే పెడతారు. మద్యంపై ఒక్కో వ్యక్తి ఏడాదికి సగటున రూ.11,351 ఖర్చు చేస్తారు. తెలంగాణలో 43.3 శాతం మంది పురుషులు మద్యం సేవిస్తారు. ఇది దేశ సగటు మద్యం తాగే పురుషులు 18.8 శాతం కంటే చాలా ఎక్కువ అని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే–5 తెలుపుతోంది. ఒక్క 2024 ఏడాదిలో లిక్కర్ అమ్మకాలు రూ. 37,485 కోట్లకు పైగా జరిగాయంటే మద్యం వినియోగం ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని నిపుణులు చెపుతున్నారు. ఒక్క 2025 డిసెంబర్ నెలలోనే మద్యం అమ్మకాలు రూ. 5,102 కోట్లు జరిగాయంటే మన వాళ్లు ఎంత తాగుతున్నారో తెలుస్తుంది. 2015–16 నుంచి ఇప్పటి వరకు మద్యం అమ్మకాలు ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నాయి, 2015–16లో రూ. 12,706 కోట్లు ఉన్న మద్యం అమ్మకాలు 2024–25 నాటికి రూ. 34,600 కోట్లకు పెరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 2600 లిక్కర్ షాపులు ఉన్నాయి. పండుగలు, న్యూఇయర్ వేడుకలు, ఎన్నికల లాంటి సమయాలలో ఒక్క రోజులోనే రూ. 300ల నుంచి 400 కోట్ల రూపాయల మద్యం వినియోగం జరుగుతుంది. న్యూఇయర్ సందర్భంగా ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే రూ.1000 కోట్లకు పైగా మద్యం విక్రయాలు జరిగినట్లు ఒక అంచనా.. కాగా హైదరాబాద్ మహానగరంలోని కూకట్‌పల్లిలో ఉన్న ఒక వైన్‌షాప్‌లో రోజుకు కోటి రూపాయల వరకు అమ్మకాలు జరుగుతాయన్న ప్రచారం ఉంది. మద్యం విక్రయాలో తెలంగాణ దేశంలో 5వ స్థానంలో ఉంది. వార్షిక సేల్స్ ఉత్తర ప్రదేశ్ రూ.45 వేల నుంచి 50 వేల కోట్లు కాగా, కర్ణాకట రూ. 40 వేల నుంచి రూ.45 వేల కోట్లు, మహారాష్ట్ర రూ. 40 వేల కోట్లు, తమిళనాడు రూ. 38 వేల నుంచి 40 వేల కోట్లు, తెలంగాణ రూ. 34 వేల నుంచి 38 వేల కోట్లుగా నమోదైంది.

**లిక్కర్ కు పెద్ద మార్కెట్ తెలంగాణ**
ఇతర రాష్ట్రాలతో చూస్తే తెలంగాణ జనాభా తక్కువగా ఉన్నప్పటికీ లిక్కర్‌కు పెద్ద మార్కెట్ ఉందని విశ్లేషకులు చెపుతున్నారు. అందుకే జనాభా తక్కువగా ఉన్నప్పటికీ లిక్కర్ సేల్స్‌లో పెద్ద రాష్ట్రాలకు దీటుగా ఉందంటున్నారు. మద్యం విక్రయాలలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ప్రాంతం నుంచే ఎక్కువగా ఉందంటున్నారు. ఇక్కడ జనాభా అధికంగా ఉండడం, ఐటి ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ఉన్నారు. దీనికి తోడు తెలంగాణలో పటాన్‌చెరువు, రామగుండం, కొత్తగూడెం లాంటి పారిశ్రామిక ప్రాంతాలలో కూడా మద్యం విక్రయాలు ఎక్కువగా జరుగుతాయని నివేదికలు తెలుపుతున్నాయి. అలాగు జాతీయ రహదారుల వద్ద ఉన్న జిల్లాల్లో లిక్కర్ షాప్‌లు ఎక్కువగా ఉన్నాయని, వీటిల్లో కూడా మద్యం విక్రయాలు బాగా జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి ఏటా మద్యం ద్వారా 12 నుంచి 15 శాతం వరకు ఆదాయం వస్తుంది. ప్రభుత్వానికి ఈ ఎక్సైజ్ ఆదాయమే కీలకంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో రోజుకు సగటున రూ.90 నుంచి రూ.110 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

**లిక్కర్ అమ్మకాలు ఎక్కువగా జరిగే జిల్లాలు**
హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిరిగి, నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి.

### దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్కో వ్యక్తి లిక్కర్ వార్షిక వినియోగం

| రాష్ట్రం | లీటర్లు |
|---|---|
| తెలంగాణ | 4.4 |
| కర్ణాటక | 4.2 |
| తమిళనాడు | 3.38 |
| ఆంధ్ర ప్రదేశ్ | 2.7 |
| కేరళ | 2.5 |

### తెలంగాణ లిక్కర్ అమ్మకాలు

| సంత్సరాల వారీగా .. | (రూ. కోట్లలో) |
|---|---|
| 2015–16 | రూ. 12,706 |
| 2016–17 | రూ.14,184 |
| 2017–18 | రూ.17,594 |
| 2018–19 | రూ.20,859 |
| 2019–20 | రూ.35,145 |
| 2020–21 | రూ.27,288 |
| 2021–22 | రూ.30,783 |
| 2022–23 | రూ.35,145 |
| 2023–24 | రూ.34,800 |
| 2024–25 | రూ.34,600 |

### టాప్ 10 రాష్ట్రాలు

| రాష్ట్రం | కోట్ల కేసులు |
|---|---|
| కర్ణాటక | 6.88 |
| తమిళనాడు | 6.47 |
| తెలంగాణ | 3.71 |
| ఆంధ్ర ప్రదేశ్ | 3.55 |
| మహారాష్ట్ర | 2.71 |
| ఉత్తర ప్రదేశ్ | 2.50 |
| కేరళ | 2.29 |
| పశ్చిమ బెంగాల్ | 1.49 |
| రాజస్థాన్ | 1.37 |
| ఢిల్లీ | 1.18 |

# గ్యారెంటీల బడ్జెట్



(మొదటి పేజీ తరువాయి)
శాఖలవారీగా ప్రీ బడ్జెట్ సమావేశాలను పూర్తి చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో మంత్రి భట్టి విక్ర మార్క సమీక్షలు నిర్వహించారు. ఈసారి బడ్జె ట్‌లో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమం, మహా లక్ష్మి , ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది.

**పెండింగ్ హామీల అమలుకు నిధులు**
అధికారంలోకి వచ్చి రెండున్నారేళ్లు పూర్తి కానుండటంతో.. ప్రభుత్వం పెండింగ్ హామీల అమలు దిశగా కసరత్తు చేస్తోంది. పెండింగ్ హామీల అమలుపై బడ్జెట్‌లో స్పష్టత అందులో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ 2,500 అదే విధంగా పెన్షన్ రూ 4,000 కు పెంపు పైన ప్రకటన ఉండే అవకాశం కనిపిస్తోంది. అదే విధంగా.. కొత్త సంక్షేమ పథకాలు, నీటిపారుదల, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఈ సారి అసెంబ్లీ సమావేశాల్లో పెన్షన్ల విషయంలో కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఈ కేబినెట్‌లో బడ్జెట్ సమావేశాలపై అధికారిక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సంక్రాంతి సమయంలోనే ఈ రెండు పథకాల అమలు పైన ప్రకటన ఉంటుందని భావించారు. అయితే, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆలస్యం అయింది. త్వరలో జెడ్పీ ఎన్నికలతో పాటుగా మూడు కార్పోరేషన్లుగా విభజించిన గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో... సంక్షేమంతో పాటుగా పెండింగ్ హామీల అమలు పైన బడ్జెట్ లో ప్రకటన చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యం లో బడ్జెట్ పైన రాజకీయంగానూ ఆసక్తి నెలకొంది.


**కేసీఆర్ వస్తారా..?**
అసెంబ్లీ సమావేశాలకు విపక్ష నేత కేసీఆర్ ప్రతిసారి డుమ్మా కొడుతూనే ఉన్నారు. గత అసెంబ్లీ సమావేశాలకు అలా వచ్చి.. సంతకం పెట్టి వెళ్లిపోయారు. ఈసారి బడ్జెట్ సమావేశాలు కావడంతో.. కేసీఆర్ వస్తేనే బాగుంటుందని గులాబీ ఎమ్మెల్యేలు కూడా భావిస్తున్నారు. కానీ, కేసీఆర్ హాజరుకావడంపై ఎలాంటి సమాచారం రావడం లేదు.

**అధికార, ప్రతిపక్షాల కసరత్తులు**
శాసనసభ, శాసనమండలిలో ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలకు సమాధానం ఇవ్వడంతో పాటుగా.. పెండింగ్‌లో ఉన్న పలు కీలక బిల్లులను కూడా ఈ సమావేశాల్లోనే ఆమోదించుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. ముఖ్యంగా ప్రతిపక్షాలు చేసే విమర్శల దాడిని తిప్పికొట్టడంతో అవసరమైన వ్యూహ ప్రతివ్యూహాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే మార్గదర్శకం చేశారు. అటు ప్రతిపక్ష బీఆర్ఎస్ సైతం అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై, అనుసరించాల్సిన వ్యూహాలపై తాజాగా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శిక్షణా తరగతులు నిర్వహించడం గమనార్హం. బీజేపీ, ఎంఐఎం సైతం తమ వ్యూహాల మేరకు ప్రభుత్వంపై దాడికి అస్త్రశస్త్రాలకు పదును పెట్టాయి.
రైతులు, నిరుద్యోగుల సమస్యలు, ఆరు గ్యారెంటీలపై ఈ సమావేశాల్లో చర్చ జరిగే అవకాశం ఉంది. మూసీ ప్రక్షాళన, హిల్ట్ పాలసీ, హైడ్రా, భూదాన్ భూములు, భూ భారతీ, కాళేశ్వరం మరమ్మతులు, కాంగ్రెస్ ఎన్నికల హామీలు, ఫ్యూచర్ సిటీ, విదేశీ పెట్టుబడులు, రైతు భరోసా పెండింగ్, జీహెచ్ఎంసీ మూడు కార్పోరేషన్ల విభజన, కాంగ్రెస్ పాలనలో చేసిన అప్పులు, సింగరేణి నైనీ బొగ్గు టెండర్ వివాదం, నిధుల దుర్వినియోగం, పార్టీ ఫిరాయింపులు, విద్యారంగ సమస్యలు వంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తనున్నాయి. ప్రతిపక్షాలకు కౌంటర్‌గా కాంగ్రెస్ ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్, కాళేశ్వం వంటి అంశాలతో ఎదురుదాడికి దిగే అవకాశం ఉంది. దీంతో ఈ సమావేశాలు అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల పర్వంతో వేసవి ఎండలను మరిపించే స్థాయిలో వాడివేడిగా సాగడం ఖాయంగా కనిపిస్తుంది.

**భారీ బందోబస్తుతో రక్షణ వలయం**
తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభల సమావేశాలు సజావుగా కొనసాగేందుకు అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం పరిసరాల చుట్టు పోలీసులు కంచెలను, బారీ కేడ్లను ఏర్పాటు చేశారు. పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రతిపక్ష పార్టీల అనుబంధ సంఘాలు ప్రజా సమస్యలపై అసెంబ్లీ ముట్టడి నిర్వహించే అవకాశం ఉండటంతో పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలు మరోసారి సమ్మె నోటీసు ఇవ్వడం.. ప్రభుత్వం ఈ నెల 26వరకు స్పందించని పక్షంలో మెరుపు సమ్మెతో పాటు అసెంబ్లీ ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.

# హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రైలు

(మొదటి పేజీ తరువాయి)
అందుబాటులోకి వస్తే ప్రయాణికులతోపాటు సరుకు రవాణాకు కూడా మేలు జరగనుంది. తెలంగాణకు అతి ముఖ్యమైన హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ ప్రతిష్టాత్మక రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్ డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేసేందుకు చేపట్టాల్సిన సర్వేను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.. లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్.. ఈ ప్రాజెక్టుకు సంబంధించి లేఖ రాశారు. అయితే ఈ రీజినల్ రింగ్ రైలుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సూచించిన మార్పులకు అనుగుణంగా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం విశేషం. రీజినల్ రింగ్ రోడ్డుకు సుమారు 10 కిలోమీటర్ల నుంచి 11 కిలోమీటర్ల దూరంలో గతంలో రీజినల్ రింగ్ రైలు మార్గాన్ని ప్రతిపాదించారు. అయితే దీనివల్ల రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైలు రెండు మార్గాలు వేర్వేరుగా ఉండటం వల్ల.. ఈ రెండు ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేపట్టడం తలకు మించిన భారంగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు. ఇలా వేరుగా చేపట్టడం వల్ల పరిపాలనపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని ముందే పసిగట్టారు. ఈ నేపథ్యంలోనే రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరం రీజినల్ రింగ్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రస్తుతం ఏర్పాటు కానున్న రీజినల్ రింగ్ రోడ్డు వెంటే రైల్వే అలైన్‌మెంట్‌ను ఖరారు చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు చేస్తోంది. అయితే ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు అమలుకు సంబంధించి కచ్చితమైన కాలపరిమితిని ఇప్పుడే చెప్పలేమని కేంద్రమంత్రి రవనీత్ సింగ్ వెల్లడించారు. కానీ డీపీఆర్ రెడీ చేసేందుకు కావాల్సిన ప్రాథమిక సర్వేకు ఆమోదం తెలపడం వల్ల ఈ ప్రాజెక్టులో కీలక అడుగు పడినట్లయింది. సర్వే పూర్తి చేసి పూర్తిస్థాయి రిపోర్టు రెడీ అయిన తర్వాత దాన్ని నీతి ఆయోగ్, కేంద్ర ఆర్థిక శాఖల ఆమోదానికి తెలంగాణ ప్రభుత్వం పంపించనుంది. అన్ని శాఖల నుంచి అనుమతులు వచ్చిన తర్వాత ఈ మెగా ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నారు.




ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును తెలంగాణ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనివల్ల హైదరాబాద్ నగరం చుట్టూ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కాకుండా.. నగర శివారు ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో కేంద్ర మంత్రులను వ్యక్తి గతంగా కలిసిన సమయంలో.. ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు ఉన్న ప్రాధాన్యతను రేవంత్ రెడ్డి వారికి వివరించారు. పక్కపక్కనే రైలు, రోడ్డు మార్గాలు ఉండటం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా భూసేకరణకు కూడా సమస్యలు తలెత్తే అవకాశాలు తక్కువగా ఉంటాయని రాష్ట్ర సర్కార్ భావిస్తోంది. ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు పూర్తి అయి.. అందుబాటులోకి వస్తే హైదరాబాద్ పొరుగున ఉన్న జిల్లాలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా సరకు రవాణాకు కూడా ఎంతో మేలు చేయనుంది. సమన్వయంతో రింగ్ రోడ్డు, రింగ్ రైలు ప్రాజెక్టులను పూర్తి చేస్తే.. ఆయా ప్రాంతాల్లో పారిశ్రామిక హబ్‌లు ఏర్పడే అవకాశం ఉంది. డీపీఆర్ సర్వేకు కేంద్రం ఆమోదం తెలపడంతో ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి.

# పైలట్ ఫాంహౌస్ లో డ్రగ్ పార్టీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తాండూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ అజీజ్‌నగర్‌లోని ఫాంహౌస్ మరోసారి వార్తల్లో నిలిచింది. శనివారం రాత్రి ఇక్కడ డ్రగ్స్ పార్టీ జరుగుతుందన్న సమాచారంతో తెలంగాణ పోలీసుల ఈగల్ టీం మెరుపు దాడులు నిర్వహించగా, తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ సహా 10 మంది ఈ పార్టీకి హాజరయ్యారని, వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే పోలీసుల రాకను గమనించిన పార్టీలోని వ్యక్తుల్లో ఒకరు వారిని భయపెట్టేందుకు తొలుత గాలిలోకి, అనంతరం పోలీసుల్ని లక్ష్యంగా చేసుకుని 3 రౌండ్లు (మొత్తం 4 రౌండ్లు) కాల్పులు జరిపారు. ఈ కాల్పులకు వాడింది రోహిత్ రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డికి చెందిన లైసెన్స్డ్ గన్ అని పోలీసులు తేల్చారు.

**పోలీసుల సోదాలు**
ఈగల్ టీంపై కాల్పులతో పరిస్థితి అదుపు తప్పడంతో స్పెషల్ ఆపరేషన్ టీమ్ రంగంలోకి దిగి ఫామ్‌హౌస్‌ను చుట్టుముట్టింది.ఈ సోదాల్లో 2 గ్రాముల కోకైన్, ఇతర మత్తు పదార్థాలతో పాటు రివాల్వర్, ఖరీదైన లిక్కర్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో ఫామ్‌హౌస్‌లో ఏపీకి చెందిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, రాజస్థాన్‌కు చెందిన ఒక మాజీ ఎమ్మెల్యే సహా మొత్తం 10 మంది ఉన్నట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వారిలో ఒక మహిళ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా మూడు రాష్ట్రాలకు చెందిన కీలక రాజకీయ, వ్యాపార ప్రముఖులు కావడంతో ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.
చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ మీడియాతో మాట్లాడుతూ.. శనివారం రాత్రి 9 గంటలకు అజీజ్ నగర్ ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ జరుగుతుందని సమాచారం వచ్చింది. ఈగల్ టీం, స్థానికులు పోలీసులు వెళ్లి రైడ్ చేశారు. పోలీసులపై ఫాంహౌస్ లో ఉన్నఢిల్లీకి చెందిన వ్యాపారి నమీద్ మిశ్రా కాల్పులు జరిపాడు. ఆ గన్ రితేష్ రెడ్డిది. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డితో పాటు ఏపీలోని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, నమీద్ మిశ్రా, శ్రవణ్ కుమార్, విజయ్ కృష్ణ, రితేష్ రెడ్డి, అర్జున్ రెడ్డి, కాసిక్ రవి, ఓ మహిళ మొత్తం 10 మంది ఉన్నారు.


**డ్రగ్స్ టెస్టులో వారికి పాజిటివ్**
పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరికీ తక్షణమే డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా ఫలితాల్లో కొందరికి కొకైన్ తీసుకున్నట్లు పాజిటివ్ రిపోర్ట్ వచ్చినట్లు సమాచారం. అయితే, ఎంపీకి మాత్రం డ్రగ్స్ పరీక్షలో నెగిటివ్ వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. డ్రగ్స్ టెస్ట్ చేయగా రోహిత్ రెడ్డితో పాటు నమీద్ మిశ్రా, అర్జున్ రెడ్డి, కాసిక్ రవి, రితేష్ రెడ్డిలకు పాజిటివ్ వచ్చింది. నిర్ధారణ కోసం బ్లడ్ శాంపిల్స్ ను ఎఫ్ఎస్ఎల్‌కు, హాస్పిటల్‌కు పంపించాం.' అని తెలిపారు. పోలీసులపై కాల్పులు జరిపినందుకు గాను ఢిల్లీకి చెందిన వ్యాపారి నమిత్ శర్మపై ఆర్మ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. ఈ డ్రగ్స్ ఎక్కడి నుండి సరఫరా అయ్యాయి? దీని వెనుక ఉన్న నెట్‌వర్క్ ఏమిటి అనే కోణంలో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు.

**పార్టీలకు అడ్డాగా మారిన హైదరాబాద్ ఫాంహౌస్‌లు..**
వీకెండ్ వచ్చిందంటే చాలు ఫాం హౌస్‌లలో పార్టీలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఫాంహౌస్‌లలో పార్టీ కల్చర్ బాగా పెరిగింది. కొందరు సెలబ్రిటీలు, నేతలు ఏకంగా డ్రగ్స్ పార్టీలు నిర్వహించి వివాదాల్లో చిక్కుకుంటున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. అయితే వీటిలో పర్మిషన్ ఉన్న లిక్కర్ పార్టీలా, లేక అక్కడ డ్రగ్స్ పార్టీలు జరుగుతున్నాయా అని స్పెషల్ టీమ్స్ ఎప్పుడూ ఫోకస్ చేస్తుంటాయి. ఇదివరకే పలువురు నేతలు, సెలబ్రిటీల బర్త్ డే పార్టీల్లో పర్మిషన్ లేకుండా లిక్కర్ తో పాటు డ్రగ్స్ పార్టీలు నిర్వహించి కేసుల్లో ఇరుక్కున్నవారు ఉన్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫాంహౌస్‌లో పలువురు ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలతో డ్రగ్స్ పార్టీ నిర్వహించారని సమాచారం అందుకున్న ఈగల్ టీం ఆకస్మిక తనిఖీలకు వెళ్లగా వారిపై కాల్పులు జరపడం సంచలనంగా మారింది.

**టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా ఆరుగురికి పాజిటివ్**
మొయినాబాద్ అజీజ్‌నగర్‌లో ఉన్న తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. డ్రగ్స్ టెస్టులో టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ (ఏలూరు)తో పాటు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సహా మొత్తం ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నమిత్, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డికి డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలింది. డ్రగ్స్ టెస్టులో టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు నెగటివ్ రాగా, బ్లడ్ టెస్టు చేయగా పాజిటివ్ వచ్చింది. దాంతో డ్రగ్ టెస్టులో మొత్తం ఆరుగురికి పాజిటివ్ వచ్చిందని ప్రకటించారు.

**11 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**
'డ్రగ్స్ పార్టీ జరుగుతుందని సమాచారం మేరకు మేం రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌పై దాడి చేశాము. లోపలికి ప్రవేశించిన సమయంలో మా అధికారులకు కొన్ని శబ్దాలు వినిపించాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అక్కడికి చేరుకోగా, ఒక వ్యక్తి పిస్టల్ పట్టుకుని కనిపించాడు. మరొకరి వద్ద ఖాళీ తూటాలు ఉన్నాయి. వెంటనే అక్కడ ఉన్న 11 మందిని అదుపులోకి తీసుకున్నాం. వారికి నిర్వహించిన ప్రాథమిక డ్రగ్ టెస్టులో ఐదుగురికి పాజిటివ్ వచ్చింది. ఆసుపత్రిలో నిర్వహించిన రక్త నమూనాల పరీక్షల్లో మరో వ్యక్తి (టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్)కి కూడా పాజిటివ్ రావడంతో, మొత్తం ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయ్యింది' అని ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్ తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న 11 మందిలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తొలుత పుట్టా మహేష్ యాదవ్‌కు నెగిటివ్ వచ్చినట్లు ప్రచారం జరిగినప్పటికీ, రక్త నమూనాల నివేదికలో ఆయనకు డ్రగ్స్ పాజిటివ్ అని తేలిందని ఎస్పీ గిరిధర్ స్పష్టం చేశారు.

**పార్టీలో ఉన్నది వీరే**
పార్టీలో 2గ్రాముల తెల్లటి పొడి (డ్రగ్స్) కూడా పోలీసులకు లభ్యమైంది. అక్కడ ఒక మహిళ సహా మొత్తం 10 మంది ఉన్నారు. వారిలో ప్రజా ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నారు. ఆ 10 మందిలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, టీడీపీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, రితేష్ రెడ్డి, శ్రవణ్ కుమార్, నమిత్ మిశ్రా, ఎం. రమేష్, విజయ్ కృష్ణ, రవి, అర్జున్ రెడ్డి ఉన్నారు. వీరిలో ఐదుగురు రోహిత్ రెడ్డి, నమిత్ మిశ్రా, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డిలకు డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చింది.





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
16.03.2026 సోమవారం, హైదరాబాద్



వంటగ్యాస్ కొరత : ముందుగానే పదార్థాలు సిద్ధం చేసుకోండి

కూరగాయలు కోయడం, మసాలాలు సిద్ధం చేయడం ముందే చేస్తే స్టౌ ఆన్ చేసి ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం ఉండదు.




# ప్రపంచ స్థాయి కేంద్రం తెలంగాణ

- లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా రూ.300 కోట్ల పెట్టుబడులు
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



అమెరికాకు చెందిన కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్ (సీఐఎల్), స్థానిక కెమ్ తత్వ చిరల్ సొల్యూషన్స్ సంయుక్తంగా అధునాతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. ఈ కంపెనీలు వచ్చే మూడేళ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెడతాయని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ ఫేజ్-4లో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ఆదివారం సచివాలయంలో తనతో సమావేశమైన రెండు కంపెనీల సిఇఓ లు పెట్టుబడులకు అంగీకరించారని ఆయన చెప్పారు. "లైఫ్ సైన్సెస్, స్పెషాలిటీ కెమికల్స్ రంగాల్లో తెలంగాణ ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదుగుతోంది. కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్, కెమ్ తత్వల భాగస్వామ్యం అంతర్జాతీయ కంపెనీలకు రాష్ట్రంపై ఉన్న ప్రగాఢ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ పెట్టుబడి ద్వారా అధునాతన కెమిస్ట్రీ, మెటీరియల్స్ రంగాల్లో రాష్ట్ర సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఈ అత్యాధునిక తయారీ కేంద్రంలో ఐసోటోప్ లేబుల్డ్ కాంపౌండ్స్ ఉత్పత్తి అవుతాయి. ప్రాజెక్టు పూర్తి అయితే దేశం వీటి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోగలుగుతుంది. ఔషధ పరిశోధనలు, జీవక్రియపై అధ్యయనాలు, రోగనిర్ధారణ పరీక్షలు, ఆధునిక ఎలక్ట్రానిక్స్, ఆర్గానిక్ ఎలక్ట్రో ల్యూమినిసెంట్ మెటీరియల్స్ (OLED), సెమీకండక్టర్ రంగాల్లో ఇవి విస్తృతంగా ఉపయోగపడతాయి. పరిశ్రమకు ఇక్కడ నెలకొని ఉన్న అనుకూల వాతావరణం, నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు, అత్యున్నత మౌలిక సదుపాయాలు, మెరుగైన ప్రభుత్వ విధానాల కారణంగా జినోమ్ వ్యాలీలో పెట్టుబడి పెట్టాలని కంపెనీలు నిర్ణయించుకున్నాయి" అని శ్రీధర్ బాబు వివరించారు. కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్‌తో భాగస్వామ్యం ద్వారా తెలంగాణలో ప్రపంచ స్థాయి తయారీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయగలమని కెమ్ తత్వ చిరల్ సొల్యూషన్స్ సీఈఓ డా. విశాల్ రాజ్‌పుత్ తెలిపారు. సమావేశంలో కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్ సీఈఓ క్లిఫ్ కాల్‌డ్‌వెల్, తెలంగాణా లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



# 22 నుంచి రైతు భరోసా

- నర్మెట్ట నుంచి విడుదల చేయనున్న సీఎం
- నిధులు విడుదలపై భట్టి, తుమ్మలతో చర్చించిన రేవంత్ రెడ్డి

**ముద్ర, హైదరాబాద్:**

అన్నదాతలకు శుభవార్త వెలువడింది. ఈ నెల 22 నుంచి రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతు భరోసా నిధులు విడుదలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఆదివారం చర్చించారు. మొదటి విడతగా ఈ నెల 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి 70 లక్షల మంది రైతులకు ఎకరం వరకు రూ.3,590 కోట్లు నిధులను రైతుల ఖాతాల్లోకి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బదిలీ చేయనున్నారు. తర్వాత మరో 20 రోజులకు రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగతా నిధులు రైతుల ఖాతాల్లోకి బదిలీ చేయనున్నారు. మొత్తంగా 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ కానున్నాయి. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ పాల్గొన్నారు.

# నన్ను ఇన్వాల్వ్ చేయొద్దు

- డ్రగ్స్ కేసులోకి లాగితే లీగల్ యాక్షన్
- కేటీఆర్ వార్నింగ్

**ముద్ర,తెలంగాణ బ్యూరో:**



ప్రతీ డ్రగ్స్ కేసులోకి తనని లాగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు. ఎలాంటి టెస్ట్‌కైనా తాను సిద్ధమని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసు తెరపైకి వచ్చిన ప్రతీసారి బీఆర్ఎస్ పార్టీని లాగడం దారుణమన్నారు. తాను, తమ పార్టీ డ్రగ్స్ వాడకానికి పూర్తి వ్యతిరేకమన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో చిక్కుకున్న నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. డ్రగ్స్ టెస్టు చేయించుకోవాలన్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సూచనను స్వీకరిస్తున్నానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారు డ్రగ్స్ వాడటం దురదృష్టకరమన్నారు. వ్యక్తిగతంగా డ్రగ్స్ వాడకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తానన్నారు. డ్రగ్స్ వాడకం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను బీఆర్ఎస్ ఖండిస్తుందని చెప్పారు. డ్రగ్స్‌ను వినియోగించేది ఎంత టివారైనా శిక్షించాలని డిమాండ్ చేశారు. 'రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు డ్రగ్స్ టెస్టుకు సిద్ధంగా ఉండాలి. నేను ఏ పరీక్షకైనా సిద్ధమని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశా. ప్రజాప్రతినిధులు డ్రగ్స్ టెస్టు చేయించుకొని అందరికీ ఆదర్శంగా ఉందాం. డ్రగ్స్ కేసులోకి నన్ను లాగితే చట్టపరంగా నోటీసులిస్తా' అని అన్నారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై మాజీ మంత్రి కేటీఆర్ బృందం సమాధానం చెప్పాలని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయని, అవసరమైతే డ్రగ్స్ పరీక్షలకు కేటీఆర్ సిద్ధం కావాలని ఆయన అన్నారు.




# చిన్న తప్పిదం.. పెద్ద విషాదం

- రాత్రంతా ఆన్ లోనే బైక్
- పొగ పీల్చి ఒకే ఇంట్లో నలుగురు మృతి
- అన్నమయ్య జిల్లాలో ఘోరం

**ముద్ర, అన్నమయ్య:**

అవగాహన లేకనో.. అమాయకత్వమో కానీ.. చిన్న పొరపాటు ఒకే కుటుంబంలో నలుగురి మృతికి కారణమైంది. ఇంకా కౌమార ప్రాయం కూడా దాటని పిల్లలతో పాటు.. 70 ఏళ్ల ఇంటి పెద్ద ప్రాణాలు తీసింది. రాత్రంతా పొగపీల్చి పడుకున్న వాళ్లు పడుకున్నట్లే నిద్రలోనే అనంతలోకాలకు వెళ్లిన విషాద ఘటన అన్నమయ్య జిల్లాలో చోటుచేసుకుంది.

పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. జిల్లాలోని పుంగనూరు పట్టణంలోని త్యాగరాజు వీధికి చెందిన మురళి, రేవతి భార్యభర్తలు. ఆయనకు ఒక కుమారుడు కార్తీక్(15), ఇద్దరు ట్విన్స్ చందన (8), చరిత (8) ఉన్నారు. మురళి తండ్రి రామచంద్రయ్య (70) కూడా వారితో పాటు నివసిస్తున్నాడు. శనివారం (మార్చి 14) మురళి తన ద్విచక్ర వాహనాన్ని బోర్ చేయించాడు. బైక్ ను రాత్రంతా ఆన్ లోనే ఉంచాలని మెకానిక్ చెప్పడంతో బండి ఆన్ చేసి పెట్టాడు. రాత్రి పిల్లలంతా తాతతో పాటే ఇంట్లో పడుకోగా.. మురళి, రేవతి ఇంటిపైన ఉన్న గదిలో పడుకున్నారు. బండిని ఆన్ లో ఉంచి ఇంటి గడియవేయడంతో సమయంలో వెలువడిన కార్బన్ మోనాక్సైడ్ పొగ పీల్చుకుని ఇంట్లో పడుకున్న నలుగురు మృతి చెందారు. ఇంట్లో తాతతో పాటు కలిసి పడుకున్న మనవడు, ఇద్దరు మనవరాళ్లు చనిపోవటం పట్టణంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇంటి పెద్దను, పిల్లలను పోగొట్టుకున్న కన్నీరు మున్నీరవుతున్నారు.





# అల్ట్రాటెక్ శుభారంభం

- కొత్త తరం నిర్మాణ సామగ్రి పరిచయం
- ముఖ్య అతిథిగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**ముద్ర, తాండూరు :**

అల్ట్రాటెక్ శుభారంభం కార్యక్రమాన్ని అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ 2026 మార్చి 15న తాండూరులోని ఎస్ వి ఆర్ గార్డెన్స్‌లో విజయవంతంగా నిర్వహించింది. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ నీరజ్ బాల్ రెడ్డి, ముఖ్యమైన వ్యక్తి ఈ కార్యక్రమానికి టెరిటరీ సేల్స్ హెడ్ రాజేందర్ దాసరి, టెక్నికల్ మేనేజర్ కె. పవన్, సి ఆర్ ఎం మొహమ్మద్ ఆసిఫ్, సి అండ్ ఎఫ్ ప్రతినిధి ముద్దప్ప దేశ్‌ముఖ్ నాయకత్వం వహించారు. స్థానిక డీలర్ శ్రీ వినాయక ట్రేడర్స్, సమీప ప్రాంత డీలర్లు, రిటైలర్లు, కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, వ్యక్తిగత గృహ నిర్మాణదారులు అధిక సంఖ్యలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థిరమైన నిర్మాణం కోసం కొత్త తరం నిర్మాణ సామగ్రి, వాటర్ ప్రూఫింగ్ సొల్యూషన్స్, సౌరశక్తి, వర్షపు నీటి సేకరణపై నిపుణులు అంతర్దృష్టులను పంచుకున్నారు.

# కూతురి గొంతు కోసి హత్య చేసిన తల్లి

- తప్పించుకున్న కుమారుడు
- ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం
- కుటుంబ కలహాలే కారణం?
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో ఆదివారం దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, మానసిక స్థితి సరిగా లేని ఓ వివాహిత తన కూతురిని గొంతు కోసి హత్య చేసి కొడుకును కూడా హత్య చేయడానికి యత్నించిన ఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. బీబీనగర్ మండలం జైనెపల్లి గ్రామానికి చెందిన బేజంకి నరేందర్ రెడ్డి భార్య బేజంకి నీలిమ (40) శనివారం సాయంత్రం జైనెపల్లి నుంచి తుక్కాపురం గ్రామంలోని తన అమ్మ వారి ఇంటికి వచ్చారు. ఆదివారం ఉదయం నీలిమ తన కుమార్తె ఎనిమిదో తరగతి చదువుతున్న బేజంకి కృతి రెడ్డి (14) గొంతు కోసి హత్య చేసింది. అనంతరం తన కుమారుడు అంశత్ రెడ్డి ఆరో తరగతి విద్యార్థి గొంతు కోయడానికి కూడా ప్రయత్నించింది. బాలుడు తప్పించుకుని కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకునేలోపే నీలిమ ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే స్థానికులు తీవ్రంగా గాయపడిన బాలుడు అంశత్ రెడ్డిని, ఉరి వేసుకొవడానికి ప్రయత్నించిన నిందితురాలిని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న భువనగిరి రూరల్ ఎస్ఐ మిర్యాల అనిల్ ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ఈతకు వెళ్తున్నారా.. జాగ్రత్త..

- బావుల వద్ద ప్రమాదాలు నివారించేందుకు అవగాహన

**ముద్ర, జోగులాంబ ప్రతినిధి:**

జిల్లాలో మల్దకల్ మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న బావుల వద్ద ఇటీవల చిన్నారులు ఎక్కువ సంఖ్యలో ఈత కొట్టడానికి వస్తుండటంతో వారి భద్రతను దృష్టిలో పెట్టుకొని ఆదివారం మల్దకల్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, మల్దకల్ ఎస్ఐ శ్రీహరి సూచనలతో పోలీసు కానిస్టేబుల్స్ బీమరాయుడు, సుధాకర్ లు మండలంలోని పలు గ్రామాల్లోని బావుల వద్దకు వెళ్లి అక్కడ ఈతకు వచ్చిన చిన్నారులకు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు చిన్నారులకు పలు జాగ్రత్తలు సూచించారు. పిల్లలు ఎప్పుడైనా బావులకు ఈత కొట్టడానికి వెళ్లాలనుకుంటే ముందుగా ఇంట్లో తల్లిదండ్రులకు లేదా పెద్దలకు తప్పనిసరిగా చెప్పి వారి సహాయంతో మాత్రమే వెళ్లాలని సూచించారు. సరదాగా లేదా ఆకతాయి తనంతో స్నేహితులతో కలిసి ఒంటరిగా బావులకు వెళ్లడం చాలా ప్రమాదకరమని, అలాంటి నిర్లక్ష్యం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని ఈ సందర్భంగా చిన్నారులకు పోలీసులు వివరించారు. గ్రామాల్లోని బావుల వద్ద భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మల్దకల్ పోలీసులు సూచించారు.



# వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

- పట్టువస్త్రాల సమర్పించిన మంత్రి పొంగులేటి

**ముద్ర, ఖమ్మం :**

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన తిరుకళ్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ పుణ్యకార్యంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీ సమేతంగా దర్శించుకున్నారు. మెట్లను కాలినడకన ఎక్కారు. ఆలయానికి చేరుకున్న మంత్రి దంపతులకు ఆలయ కమిటీ ఘనస్వాగతం పలికారు. స్వామివారికి మంత్రి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన కళ్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో వీక్షించారు. పండితులు వారికి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. "ప్రకృతి ఒడిలో ఉన్న శ్రీనివాసగిరిని 'ఎకో టూరిజం' (ప్రకృతి పర్యాటక) కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
16.03.2026 సోమవారం, హైదరాబాద్




# వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744





## వానరాగాలు

చెట్లు పెంచు — అడవులు సృష్టించు,
పచ్చదనం పరచు — మబ్బులు తేలించు,
చినుకులు రాలనీ — వాగులు పారనీ,
గొంతుల దప్పిక తీరనీ — మనసులు
మురిపించనీ.
వానను రానీ,
వాడిన నేలపై వాసంతం చిందనీ.
వానను కురవనీ,
వేల జీవుల్లో వెలుగులు నింపనీ.
వానను తడుపనీ,
తడిసిన పొలాల్లో పచ్చదనం పూయనీ.
వానను పారనీ,
వాగుల గుండెల్లో గలగలలాడనీ.
వానను పొంగనీ,
కాలువల ఒడిలో కలల్ని నింపనీ.
వానను పాడనీ,
మేఘాల వీణలో మధురంగా మ్రోగనీ.
వానను సాగనీ,
పల్లెల గుండెల్లో పంటల్ని పండనీ.
వానను మాట్లాడనీ,
చినుకుల భాషలో ప్రేమలు చెప్పనీ.
వానను నవ్వనీ,
మనసుల మైదానాల్లో మాధుర్యాలు
చల్లనీ.
వానను ఒలుకనీ,
జీవజాలానికి
జీవామృతం పంచనీ.



— గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్, భాగ్యనగరం.

# డిండి ఎత్తిపోతలకు అన్నీ అడ్డంకులే



పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఫ్లోరైడ్ పీడీత ప్రాంతమైన నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు,నల్లగొండ నియోజకవర్గాలలోని కరువు పీడిత గ్రామాలకు త్రాగు, సాగుకు కృష్ణా జలాలు అందించాలని ఆ జిల్లా ప్రజలు సుదీర్ఘకాలంగా పోరాటాల ఫలితంగా డిండి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టుటకు వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం సర్వే చేయించి తేది :77 2007 న జిఓ నెం. 159 ను 3.5 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు త్రాగు నీటిని అందించవచ్చని, ఈ ప్రాజెక్టుకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని నిపుణుల కమిటీ నివేదికను ఏమోదించారు. ఆనాడు శ్రీశైలం ఎడమగట్టు స్వరంగం లో అంతర్భాగంగా చేపట్టాలని నిర్ణయించినప్పటికీ.. వివిధ కారణాలచే పనులు పూర్తిగాకాక పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. 2014లో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఇది ఎక్కువ ఖర్చుతో కూడుకున్నదని ఫీజుబులిటీ లేదని నిర్ణయానికి వచ్చి.. ఈ పథకాన్ని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల్లో భాగంగా చేర్చడం జరిగింది.

**డిండి ఎత్తిపోతలు :**

శ్రీశైలం జలాశయం నుంచి వరద జలాల నుండి రోజుకు 2 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 120 టీఎంసీలు ( పాలమూరు రంగారెడ్డి కి 90 టీఎంసీలు, డిండి ఎత్తిపోతలకు+ 30 టీఎంసీలు ) తరలించడానికి జిఓ నెం.105 తేదీ 10 6 2015 న రూ. 35,200 కోట్ల తో శాంక్షన్ ఇస్తూ 116 2015 న కేసిఆర్ శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రోజుకు 0.50 టీఎంసీలు చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీలు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు తరలించి 3 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామని 2015 ఆగస్టులో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ శివన్న గూడెం దగ్గర చర్లగూడెం రిజర్వాయర్( మరిగూడెం మండలం)కు శంకుస్థాపన చేశారు. డిండి లిఫ్ట్ స్కీంకు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నుండి నీరు తరలించటాన్ని పాలమూరు ప్రజలు కొంత వ్యతిరేకత తెలుపుతూనే ఉన్నారు. దీంతో గత ప్రభుత్వం ఈ స్కీము పనులలో వేగంగా జరపకుండా కాలయాపన చేస్తూ వచ్చింది. కానీ ఈ ప్రాజెక్టుకు ఎక్కడి నుంచి నీరు తరలించాలనే అంశంపైన గత బిఆర్ ఎస్ ప్రభుత్వం డిపిఆర్ తయారు చేయకుండా పెండింగ్లో పెడుతూ వచ్చింది. నల్లగొండ జిల్లాలో చేపట్టే రిజర్వాయర్ల లో భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం ఇవ్వటంలోను, పనులలలో కొంత కాలయాపన జరుగుతువస్తుంది.

**ఏదుల నుంచి డిండికి నీరు :**

శ్రీశైలం నుంచి వరద జలాల నుండి రోజుకు 2 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 120 టీఎంసీల నీటిని ఎత్తిపోతల లో భాగంగానే డిండి పథకానికి రోజుకు 0.5 టిఎంసిల చొప్పున నాగర్ కర్నూల్, నల్లగొండ జిల్లాలోని 3.41 లక్షల ఎకరాల ఆయకట్టుకు నిరంధించే పనులు రూ. 1800 కోట్లతో చేపట్టుటకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శ్రీశైలం నుంచి నీటిని తీసుకొని ప్రస్తుతం ఉన్న డెండి రిజర్వాయర్ కు మళ్ళించి అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఆయకట్టుకు నిరంధించటం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. రిజర్వాయర్ల, కాలువల పనులు నడుస్తున్నాయి. దీనిపై ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు వ్యతిరేకత తెలుపుతున్న నేపథ్యంలో.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఆపకుండా వాటికి ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని జిల్లా ప్రజలకు తెలిపింది. ఇందులో భాగంగా పాలమూరు రంగారెడ్డి వైపు ఏదుల, వట్టెం, నార్లాపూర్ రిజర్వాయర్ల నిర్మాణ పనులు పూర్తి చేశారు. నల్లగొండ జిల్లాలో 11 రిజర్వాయర్లను చేపట్టగా కిష్టరాంపల్లి, చింతపల్లి రిజర్వాయర్లు మినహా మిగతావన్నీ పూర్తయ్యాయి. భూ సేకరణ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వల్ల నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎర్రబెల్లిగోకారం, రంగారెడ్డి జిల్లా లోని ఇర్విన్ రిజర్వాయర్, నల్లగొండజిల్లాలో ప్రధాన కాలువల పనులు పెండింగ్లో ఉన్నాయి.

**ఇప్పుడు వివాదం రేపిన ఈ ఎన్ సి సర్కులర్:**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జిల్లా ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు.. ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి ఆయా జిల్లాల ప్రతినిధులతో చర్చలు జరిపి ఒప్పించి టెండర్లు, అగ్రిమెంట్లను పూర్తి చేయించారు. పాలమూరు కింద చేపడుతున్న ఏదుల రిజర్వాయర్ లో 336 మీ నీటి మట్టం నుంచి డిండి లిఫ్ట్ స్కీంకు నీటిని తరలించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది, గత ఏడాది జనవరి 22న నీటిపారుదల శాఖ జీవో 10 జారీ చేసింది.. ప్రకారము కాలువల పనులు నడుస్తున్నాయి. కానీ ఇటీవల రిటైర్డ్ అయినా ఓ ఈ ఎన్ సి గతంలో ఇచ్చిన సర్కులర్ కొత్త వివాదానికి తెరలేపింది. ఏదుల రిజర్వాయర్లో నీటిమట్టం కనీసం 440 మీటర్లు ఉన్నప్పుడే డిండి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు నీటిని తరలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నీటిపారుల శాఖ సిఫారసు చేసింది.ఫిబ్రవరి 6న నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) నేతృత్వంలోని కమిటీ డిండి ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

**ఏదులలో 440 మీటర్లు ఉంటేనే...**

ఏదుల రిజర్వాయర్లో కనీసం 437.375 మీటర్ల నీటి మట్టం ఉంటేనే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నుంచి వీరాంజనేయ బ్యాలెన్స్ రిజర్వాయర్ కు నీటిని తరలించాలని గతంలో అనుమతులు ఇచ్చారు. ఏదుల జలాశయ గరిష్ట నీటి నిల్వ మట్టం (ఎఫ్ ఆర్ ఎల్)445 పీటర్లు కాగా గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 6.59 టీఎంసీలు. జలాశయంలో 440 మీటర్ల మట్టంతో 4.16 టీఎంసీలు.437 మీటర్ల మట్టంతో 3.04 టీఎంసీల నిల్వలు,436 మీటర్ల మట్టంతో 2.72 టీఎంసీలు నిల్వలు ఉంటాయి. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించడానికి నిర్మిస్తున్న కాల్వ అడుగు( బెడ్ లెవల్ ) 21.643 కీ.మి ల వద్దా 421.45 మీటర్ల మట్టాన్ని కలిగి ఉండగా, ప్రతిపాదనల ప్రకారం ఏదులలో 436.41 వీటిల్లో మట్టం నుంచి నీటిని తరలించాల్సి ఉంటుంది. డిండి ఎత్తిపోతులకు నీటిని తరలించడానికి ఏదుల రిజర్వాయర్లు ఉండాల్సిన నీటిమట్టం, దిండి ప్రాజెక్టు కాలువల లోతు మధ్య 4.9 మీటర్ల వ్యత్యాసం ఉంది. ఈ నేపథ్యంలో డిండి ఎత్తిపోతల పథకము ద్వారా నీటిని తరలించడానికి ఏదుల రిజర్వాయర్లో ఉండాల్సిన కనీస నిల్వ మట్టాన్ని 440 మీటర్లకు పెంచాలని ఈ.ఎన్.సి నేతృత్వంలో కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఏదుల రిజర్వాయర్ను 440 మీటర్లకు నింపడానికి కేవలం 2 రోజులే పడుతుందని, దీనివల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేసింది. ఏదులలో 440 మీటర్ల స్థాయిలో నిల్వలున్నప్పుడే డిండి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని సూచించింది.డిండి ఎత్తిపోతల పథకము ద్వారా నాగర్ కర్నూల్, నల్లగొండ,యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాలోని 21 మండలాల పరిధిలో 3.61 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించారు. 440 మీటర్లకు చేరినప్పుడే డిండి ఎత్తిపోతలకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆ జిల్లా శాసనసభ్యులు, పార్టీల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పునః సమీక్షించి జిల్లాకు నష్టం జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



**ఉజ్జిని రత్నాకర్ రావు: 9490952646**



# టీకా.. ఆరోగ్య రక్షణకు అతి శక్తివంతమైన ఆయుధం

**మార్చి 16 జాతీయ టీకా దినోత్సవం**

ప్రపంచవ్యాప్తంగా అంటువ్యాధుల నియంత్రణలో టీకాల పాత్ర అపారమైనది. కరోనా మహమ్మారి సమయంలో వ్యాక్సిన్లు కోట్లాది ప్రాణాలను కాపాడిన విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ టీకాలపై అవగాహన ఇంకా పూర్తిగా పెరగాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా భారతదేశంలో పెద్దవారు టీకాలు తీసుకోవడంపై ఇంకా కొంత నిర్లక్ష్యం కనిపిస్తోంది.టీకాలు అంటే పిల్లలకు మాత్రమే అవసరమని చాలామంది భావించడం ఒక పెద్ద అపోహ. కానీ జీవితం మొత్తం రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి కొన్ని టీకాలు పెద్దవారికి కూడా అవసరం అవుతాయి. ఫ్లూ, హెపటైటిస్, హెచ్‌పీవీ వంటి వ్యాధులను నివారించడంలో టీకాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ వైద్యుల సూచనల మేరకు వాక్సినేషన్ షెడ్యూల్‌ను పాటించడం అత్యంత అవసరం.ప్రజారోగ్య పరిరక్షణలో టీకాలు ఒక కీలక భాగం. వ్యక్తిగత ఆరోగ్యమే కాకుండా సమాజాన్ని కూడా అంటువ్యాధుల నుంచి రక్షించడంలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తాయి. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రభుత్వాలు ప్రజల్లో టీకాలపై అవగాహన పెంచడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. భారతదేశంలో 1995లో ప్రారంభమైన పల్స్ పోలియో కార్యక్రమం వల్ల పోలియో నిర్మూలన సాధ్యమైంది.

ప్రస్తుతం HPV వంటి టీకాల ద్వారా క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులను కూడా నివారించగలుగుతున్నాం. ముఖ్యంగా 9-14 సంవత్సరాల మధ్య ఉన్న బాలికలకు ఈ టీకా ఎంతో ప్రయోజనకరం. ఇది భవిష్యత్తులో వచ్చే గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.జాతీయ టీకా దినోత్సవం సందర్భంగా టీకాల ప్రాముఖ్యతను గుర్తు చేసుకోవడం మాత్రమే కాకుండా, వాటిపై ఉన్న అపోహలను తొలగించడం కూడా అవసరం. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, వ్యాయామం, సరిపడ నిద్రతో పాటు అవసరమైన టీకాలను సమయానికి తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుంది.అందుకే "టీకా వేయించుకుంటే ఆరోగ్యానికి డోకా లేదు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. టీకాలు వ్యక్తిని మాత్రమే కాదు, సమాజాన్ని కూడా రక్షించే శక్తివంతమైన రక్షణ కవచమని చెప్పడంలో సందేహం లేదు.

*** సుధాకర్.ఏ.వి**
*** రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు**
*** స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (STUTS)**
*** 9000674747**




# చరిత్రలో తొలిసారి..
# ఎన్నికల కమిషనర్‌పై 'అవిశ్వాస' అస్త్రం!

## 193 మంది ఎంపీల ఉమ్మడి సంతకం!

(లోక్‌సభ 130.. రాజ్యసభ 63: జ్ఞానేష్ కుమార్‌కు 193 మంది ఎంపీల 'బహిష్కరణ' నోటీసు! వ్యవస్థల పతనంపై పార్లమెంటరీ అస్త్రం: సీఈసీ తొలగింపు నోటీసు వెనుక అసలు కథ ఇదేనా?)

**చరిత్రలో తొలిసారి..**
**ఎన్నికల కమిషనర్‌పై 'అవిశ్వాస' అస్త్రం!**
**193 మంది ఎంపీల సంతకం**



భారత రాజ్యాంగం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. ఒక సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి ను తొలగించే విధానంతో సమానమైన రక్షణలు దీనికి ఉన్నాయి. పార్లమెంటులో తొలగింపు నోటీసు పెట్టాలంటే లోక్‌సభలో కనీసం 100 మంది లేదా రాజ్యసభలో 50 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే ఈసారి ప్రతిపక్షాలు ఆ సంఖ్యను చాలా ఎక్కువగా దాటి, లోక్‌సభ నుంచి 130 మంది, రాజ్యసభ నుంచి 63 మంది — మొత్తం 193 మంది ఎంపీల సంతకాలతో నోటీసు సిద్ధం చేశారు. ఇది ఎన్నికల వ్యవస్థ పనితీరుపై ప్రతిపక్షాల తీవ్ర అసంతృప్తిని చూపుతున్న అరుదైన పరిణామంగా.ఈ వివాదానికి ప్రధాన కారణంగా ఎన్నికల కమిషనర్ల నియామక విధానంలో జరిగిన మార్పులను ప్రతిపక్షాలు చూపిస్తున్నాయి. గతంలో నియామక కమిటీలో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా ఉండేవారు. కానీ కొత్త చట్టం ప్రకారం ఆ స్థానంలో ఒక కేంద్ర మంత్రిని చేర్చడం జరిగింది. దీంతో నియామక ప్రక్రియలో ప్రభుత్వ ప్రభావం పెరుగుతుందని, ఎన్నికల సంఘం స్వతంత్రత దెబ్బతింటుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నియామకం కూడా వివాదస్పదమైందని అంటున్నారు.



ఇటీవల జరిగిన కొన్ని ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల షెడ్యూల్ నిర్ణయం నుంచి మోడల్ కోడ్ అమలు వరకు కమీషన్ పక్షపాతంగా వ్యవహరిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అధికార పార్టీ నేతలపై చర్యల్లో జాప్యం చేస్తూ, విపక్ష నేతలపై కఠినంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. అలాగే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల విశ్వసనీయత, ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రైల్ స్లిప్పుల పూర్తి లెక్కింపు వంటి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగంలోని అధికరణ 124(4) ప్రకారం నిరూపితమైన దుష్ప్రవర్తన లేదా అసమర్థత ఆధారంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించవచ్చు.

ముందుగా ఈ నోటీసును లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ ఛైర్మన్ నియమించారు. ఆమోదిస్తే ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ ఏర్పాటు అవుతుంది. కమిటీ ఆరోపణలు నిజమని తేలితేనే పార్లమెంటులో చర్చకు వస్తుంది. అక్కడ కూడా రెండు సభల్లో హాజరైన సభ్యుల మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం.

ప్రస్తుత సంఖ్యాబలం ప్రకారం ప్రతిపక్షాలకు ఈ మెజారిటీ సాధించడం కష్టమే అయినా, 193 మంది ఎంపీల సంతకం ప్రభుత్వానికి మరియు ఎన్నికల సంఘానికి బలమైన రాజకీయ హెచ్చరిక మేరకు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకం నిలబెట్టుకోవాలంటే పారదర్శకత, స్వతంత్రత తప్పనిసరి అని ఈ పరిణామం మరోసారి గుర్తు చేస్తోంది. రానున్న రోజుల్లో పార్లమెంటులో జరిగే చర్చలు భారత ఎన్నికల వ్యవస్థ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి.



**వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863**

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 16.03.2026
www.mudranews.in | @mudranews



**వంటగ్యాస్ కొరత**



సరైన పరిమాణంలో మంట పెట్టండి. పాత్రకు మించి పెద్ద మంట పెట్టడం వల్ల గ్యాస్ వృథా అవుతుంది. పాత్ర అడుగు భాగం వరకే మంట ఉండేలా చూసుకోవాలి.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**





పరిసరాల పరిశుభ్రత పాటించడం ప్రతి ఒక్కరి ధర్మమని, పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యం గా ఉంటారని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సమక్షంలో హాస్పిటల్ లోని జనరల్ వార్డులో పరిశుభ్రత పనులు చే పట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక లో ప్రధానంగా పది అంశాలు తీసుకోవడం జరిగిందన్నారు. ముందుగా మున్సిపల్ చైర్మన్లకు, సర్పంచ్లకు, కౌన్సిలర్లకు, వార్డు సభ్యులకు అవగాహన కల్పించి శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేరుస్తున్నామని, అర్రైవ్ –అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోడ్ల పై వాహనదారులు చేసే చిన్న పొరపాట్ల వల్ల ప్రమాదం జరిగి కుటుంబాలు వీధిన పడుతుయన్నారు. కార్లు, బైక్ లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. రహదారులపై బ్లాక్ స్పాట్ లు గుర్తించి స్పీడ్ కంట్రోల్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలకు వెనక వైపు రేడియం స్టికర్లు తప్పనిసరిగా అంటించాలన్నారు.

**బోయిన్‌పల్లిలో సబ్‌స్టేషన్ ప్రారంభం**

జడ్చర్ల నియోజకవర్గం మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లి గ్రామంలో రూ.3.05 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ ద్వారా మిడ్జిల్ మండలంలోని పలు గ్రామాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. రైతులు, గృహ వినియోగదారులు,చిన్న పరిశ్రమలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ మిడ్జిల్ మండల ప్రజల దీర్ఘకాలిక అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో 31 సబ్‌స్టేషన్లు మాత్రమే ఉండగా తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత రెండేళ్ల లో 22 (33/11 కేవీ) సబ్‌స్టేషన్లు, నవాబ్‌పేట్‌లో 133/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయించినట్లు తెలిపారు. వాటిలో భాగంగా బోయిన్‌పల్లి గ్రామంలో మొదటి సబ్‌స్టేషన్‌ను మంత్రి శ్రీహరి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ రెండేళ్లలో జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి రూ.213 కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ పుష్పలత, డీ ఎంహెచ్ఓ కృష్ణ పాల్గొన్నారు.

# అంజన్న సన్నిధిలో సౌకర్యాలు కరువు

**ముద్ర, పెబ్బేర్:**



ఉమ్మడి పెబ్బేరు మండల పరిధిలోని పాతపల్లి, నాగసానిపల్లి గ్రామాల సరిహద్దుల్లో వెలసిన చారిత్రాత్మక చింతకుంట ఆంజనేయస్వామి ఆలయం ప్రస్తుతం సమస్యల నిలయంగా మారింది. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా వెలుగొందుతున్న ఈ క్షేత్రానికి ప్రతి శనివారంతో పాటు విశేష పర్వదినాల్లో వందల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. అయితే ఆలయ పరిసరాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణా సౌకర్యం లేక ఆలయానికి భక్తులు చేరుకోవడానికి సరైన రహదారి సౌకర్యం లేక, ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. సరైన బస్సు సౌకర్యం లేక దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. క్షేత్రం వద్ద మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం లేకపోవడం గమనార్హం. ముఖ్యంగా మహిళా భక్తులు, వృద్ధులు ఆరుబయట వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి వసతి, విశ్రాంతి గదులు లేక వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో తాగునీటి సౌకర్యం లేక, విశ్రాంతి గదులు (షెడ్లు) అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే తమకు ఈ నరకయాతన తప్పదని భక్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే ఆలయ ప్రాంగణంలో మరుగుదొడ్ల నిర్మాణం, రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.

# చేనేత కార్మికుల రిలే దీక్షలకు మద్దతు ఇవ్వండి

**హరీష్ రావును కలిసిన తెలంగాణ చేనేత కార్మిక సంఘం నేతలు**

**ముద్ర, హైదరాబాద్:**



చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 23, 24, 25 తేదీలలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతు ఇవ్వాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం నేతలు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ను కోరారు. ఆదివారం ఉదయం ఆయన నివాసంలో సంఘం అధ్యక్షుడు వనం శాంతి కుమార్, కార్యదర్శి ముషం నరహరి కలిసి దీక్షలకు విచ్చేసి చేనేత కార్మికులకు సందేశం ఇవ్వాలని కోరారు. ఈ రిలే నిరాహార దీక్షలకు చేనేత వర్గానికి చెందిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను ప్రారంభోత్సవానికి ఆహ్వానించినట్లు కూడా ఆయనకు తెలిపారు. దీక్షా శిబిరానికి తాను కూడా విచ్చేసి మద్దతు తెలుపుతానని హరీష్ రావు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

# కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్**



జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి సమక్షంలో వీరికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. బీజినపల్లి మండలం బోరుసుగడ్డ తండా గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ కె. లలిత రవి నాయక్, ఉప సర్పంచ్ ఆర్. చావులి చందు, వార్డ్ సభ్యులు కేసరి, రాజు, జ్యోతి, అనూష, బీజినపల్లి మండలం గంగారం పెద్ద తండా గ్రామం నుంచి సర్పంచ్ గోపాల్ నాయక్, వార్డ్ సభ్యులు బాధ్య నాయక్, కమ్లా నాయక్, పాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ బుర్రి యాదవ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మడ్డి బాల్ రాంగౌడ్, మేస్త్రి సంఘం నాయకుడు వట్టెపు నాగయ్య, తిమాజీపేట మండలం హేమ్లా నాయక్ తండా గ్రామానికి చెందిన సర్పంచ్ కేతావత్ కృష్ణ కుమార్, తాడూరు మండలం భల్లన్ పల్లి గ్రామం నుంచి సర్పంచ్ భారతమ్మ నరసింహ ఆధ్వర్యంలో అంబేద్కర్ యువసేన సంఘానికి చెందిన సుమారు 50 మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# చైన్ స్నాచింగ్ నిందితున్నిపట్టుకున్న పోలీసులు

**ముద్ర, కూకట్‌పల్లి:**

సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సమీపంలో సాయంత్రం వేళ డాక్టర్ నందిపల్లి కిరణ్ (40) అనే వ్యక్తిని బెదిరించి బంగారు గొలుసు అపహరించిన ఘటనలో కూకట్‌పల్లి పోలీసులు మెరుపు వేగంతో స్పందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, కేసు నమోదైన 24 గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేసి కటకటాల్లోకి నెట్టారు. బాచుపల్లికి చెందిన ఈ డాక్టర్ షాపింగ్ నిమిత్తం కూకట్‌పల్లికి వచ్చారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, ఒక వ్యక్తి స్కూటీపై వెనుక నుంచి వచ్చి మెడలోని బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. బాధితుడు వెంటనే కూకట్‌పల్లి ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డీసీపీ శ్రీమతి రితిరాజ్ ఆదేశాల మేరకు బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి పర్యవేక్షణలోకూకట్‌పల్లి క్రైమ్ టీమ్, సీసీఎస్ బాలానగర్ బృందం సంయుక్తంగా ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడిని గుర్తించి, గాలింపు చర్యలు చేపట్టి అదుపులోకి తీసుకున్నారు. తక్కువ సమయంలోనే కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

# ఎల్లమ్మబండలో 'క్లీనప్ డ్రైవ్'లో ఎమ్మెల్యే

**ముద్ర, కూకట్‌పల్లి :**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని, ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా యువత ముందుకు రావాలని ప్రభుత్వ ప్రజా పద్దుల కమిటీ పిలుపునిచ్చారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో దేవుని సంఘం ప్రపంచ పరిచర్య సంస్థ యువ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భారీ క్లీనప్ యాక్టివిటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఎమ్మెల్యే ప్లాస్టిక్ వ్యర్థాల ను తొలగించారు. 150 మంది ఈ క్లీనింగ్ డ్రైవ్‌లో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.

# చత్రపతి విగ్రహ ఏర్పాటుకై విరాళాల సేకరణ

**ముద్ర, నారాయణపేట:**

జిల్లా కేంద్రంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు కోసం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని పళ్ళ పోల్కమ్మ అమ్మవారి ఆలయం వద్ద పూజలను చేసి ఆదివారం ప్రారంభించారు. జి. కురుమన్న, జి శేషు యాదవ్, శ్రీపాద్ కులకర్ణి లు ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున విరాళం అందించారు. అలాగే సంకలపురం మల్లేష్ రూ. 51 వేలు అందించగా భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షల చెక్ అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహేష్, ఆర్ఎస్ఎస్ నాయకులు డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, రఘురామయ్య గౌడ్, కన్న శివకుమార్, పళ్ళ రఘు, పావడి మహదేవ్, హోటల్ నవీన్, మణిశంకర్, జుట్టు వెంకటేష్ పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ముద్ర, కాప్రా:**

విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కోరారు. అకాడమీ హైట్స్ నాచారంలో జరిగిన స్కూల్ స్పోర్ట్స్ మీట్ ను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి స్పోర్ట్స్ మీట్ లు మరెన్నో నిర్వహించాలని ఆయన సూచించారు. క్రీడల్లో రాణించి సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ శివ కుమార్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ శ్రీనివాస్ బంటి పాల్గొన్నారు.

# అదనపు తరగతి గదులు ప్రారంభం

**ముద్ర, తాండూర్:**

పెద్దముల్ మండలం మారేపల్లిలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ. 2.30 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులను తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తాము అను కున్న లక్ష్యాలను సాధించేందుకు బాల్యదశలోనే నిర్ణయించుకోవాలన్నారు. అనంతరం మారేపల్లి ప్రధాన రహదారిపై వెలసిన ఆర మైసమ్మ దేవాలయ 11వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. తాండూర్ చైర్పర్సన్ పట్లోళ్ల నీరజ, స్థానిక సర్పంచ్ మంగలి సునీత, కోట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, శోభారాణి, లొంక నర్సింలు, మల్లేశం, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

# కష్టపడే వారికి గుర్తింపు

**ముద్ర, కూకట్‌పల్లి :**

పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరై ఆమెకు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి సంధ్య, రజిత, రాధా, కల్పన, శైలజ, మహిళా కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యలపై సీఎంకు మాజీ మంత్రి లేఖాస్త్రం

**ప్రశ్నించే వారిని అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం**
**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**ముద్ర, వనపర్తి:**



వనపర్తి నియోజకవర్గ ముఖ్య సమస్యలపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలకు స్పందించాలని సూచించారు. ప్రశ్నించే వారిని అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని, సంక్షేమ పథకాలు అమలు కాకపోతే స్పందించడం వారి హక్కు అని అన్నారు. రైతు భరోసా విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. రైతులకు సకాలంలో కరెంట్, యూరియా సరఫరా చేయలేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. శ్రీధర్ రెడ్డి హత్య కేసు రెండున్నరేళ్లు గడిచినా తేల్చకపోవడం ప్రభుత్వ అసమర్థత అని ఆయన ఆరోపించారు. వారం రోజుల్లో కేసు పురోగతి కనిపించకపోతే ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. అన్ని వసతులతో నిర్మించిన టౌన్ హాల్ ఇప్పటికీ ప్రారంభించకపోవడం, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రామన్న గట్టు రిజర్వాయర్ పనులు నిలిచిపోవడం దురదృష్ట కరమని, డీ–5, డీ–8 కాలువలను ఆధునీకరించడం ద్వారా సాగునీటి విస్తీర్ణం పెంచే అవకాశాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. మెడికల్ కాలేజ్ ప్రాంగణంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం చేపట్టడం సరికాదని, స్కూల్ నిర్మాణానికి వ్యతిరేకం కాదని కానీ మెడికల్ కాలేజ్ ఆవరణలో కాకుండా వేరే ప్రదేశంలో స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే రాజపేట నుంచి పానగల్ రోడ్డును కలుపుతూ ప్రతిపాదించిన అర్ధచంద్రాకార బైపాస్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కోరారు. పెబ్బేర్ సంత స్థలం వివాదాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, లక్ష్మా రెడ్డి, ఎద్దుల కరుణశ్రీ, కృష్ణా నాయక్, రఘుపతి రెడ్డి, భీమన్న, కర్రె స్వామి, తిరుపతయ్య, మాణిక్యం, పెద్దింటి వెంకటేష్, దిలీప్ రెడ్డి, శివరాం రెడ్డి, గౌడ్ నాయక్, రాజశేఖర్, సూర్యవంశం గిరి, చంద్రశేఖర్, చిట్యాల రాము, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ లో ఎమ్మెల్యేలకు డ్రగ్ టెస్ట్ లు చేయించాలి

**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



ప్రజలకు ఆదర్శం గా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు వ్యసనాలకు బానిసై ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, ఇకనుంచి అసెంబ్లీ కి వచ్చే ఎమ్మెల్యేలకు డ్రగ్ పరీక్ష లు చేయాల్సిన అవసరం ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంచలన కామెంట్ చేశారు. ఆదివారం జడ్చర్ల లో మాట్లాడుతూ ఎమ్మెల్యే లు ధృతయుతంగా అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. డ్రగ్ టెస్టులకు సంబంధించిన రక్త పరీక్షను అందరికంటే ముందుగా తానే చేయించుకుంటానన్నారు. డ్రగ్స్ టెస్టులలో పాజిటివ్ గా తేలిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మొయినాబాద్ లో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్ లో డ్రగ్స్ పార్టీ జరగడం, అందులో ఐదు మందికి డ్రగ్స్ పాజిటివ్ గా తేలిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మొయినాబాద్ ఫామ్ హౌస్ లో డ్రగ్స్ సేవించినట్లు పాజిటివ్ గా తేదీన వారిలో ప్రజాప్రతినిధులు ఉండడంతో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇతరుల పేరు మీద ఉన్న లైసెన్స్ ఉన్న గన్ను తీసుకొని దాంతో కాల్పులు జరపడం చూస్తే నిందితులకు ఎలాంటి భయం లేదనే విషయం అర్థమవుతున్నదన్నారు. ఈ ఫామ్ హౌస్ లో డ్రగ్స్ సేవించి పాజిటివ్ గా తేలిన వారిని ఎంత కఠినంగా శిక్షించాలంటే ఆ శిక్షను చూసి ఇతరులు ఎవ్వరికి డ్రగ్స్ తీసుకోవాలంటే ఆలోచన రాకూడదన్నారు.

# 2027 జనగణన దేశాభివృద్ధికి కీలకం

**కలెక్టర్ బాదావత్ సంతోష్**

**ముద్ర, నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి:**



జిల్లాలో జనగణన విధులను అధికారులు కచ్చితంగా నిర్వహించాలని, వంద శాతం జనాభా లెక్కలు సేకరించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. 2027 జనగణన నేపథ్యంలో జిల్లాలో జనాభా లెక్కల సేకరణలో భాగస్వాములు కానున్న అధికార గణానికి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ శిక్షణ మూడు రోజుల పాటు కొనసాగనుంది. హైదరాబాద్ నుంచి వచ్చిన సెన్సెస్ జాయింట్ డైరెక్టర్ బి. లాజర్, మాస్టర్ ట్రైనర్లు శివరామకృష్ణ, రాజేశ్వర్, టెక్నికల్ సపోర్ట్ టీమ్ సభ్యులు అధికారులకు జనాభా గణనపై సమగ్ర అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జనాభా లెక్కల సేకరణ విధానం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం తొలిసారిగా పూర్తిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటోందన్నారు. అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా పరిషత్ సీఈవో దేవ సహాయం, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సుజాత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఇళ్ల గణనను పకడ్బందీగా నిర్వహించాలి**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**

జనాభా లెక్కలు 2027 ప్రక్రియలో భాగంగా మొదటి దశ చేపట్టవలసిన ఇళ్ల గణన పకడ్బందీగా చేపట్టాలని అధికార యంత్రాంగానికి అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్ సూచించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చార్జ్ అధికారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈసారి ఇండ్ల గణన కార్యక్రమాన్ని పూర్తి డిజిటలైజేషన్ పద్ధతిలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదు చేసి ఇండ్ల జాబితా రూపొందిస్తారని తెలిపారు. సెన్సెస్ ఇండెక్స్ పుస్తకాన్ని పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, మాస్టర్ ట్రైనర్లు వివరించే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని తెలిపారు. ఈ శిక్షణలో ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సీపీవో సౌమ్య, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్ మోహన్, ఆర్డీవోలు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 16.03.2026
www.mudranews.in | @mudranews



### వంట గ్యాస్ కొరత

పాత్రలకు మూత పెట్టి వండండి



మూత పెట్టి వండితే వేడి బయటకు పోకుండా ఉంటుంది. దీంతో వంట త్వరగా అయి గ్యాస్ ఆదా అవుతుంది.

# ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలి

**- డీపీఓ వెంకటేశ్వర్ రావు**



**ముద్ర, మంచిర్యాల:**
ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించి కంపోస్ట్ ఎరువు తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి డీ వెంకటేశ్వర్ రావు సూచించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా పారిశుధ్య కార్మికులు సేవలను గుర్తిస్తూ ఆదివారం మంచిర్యాల జిల్లాలోని పలు గ్రామపంచాయతీల్లో ఘనంగా సన్మానించారు. తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామపంచాయతీలో జరిగిన కార్యక్రమానికి డీపీవో ముఖ్య అథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా పరిశుభ్రత కోసం నిరంతరం కష్టపడి పనిచేసే కార్మికులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. పారిశుధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో వారి పాత్ర మరువలేనిదని తెలిపారు. గ్రామంలోని అన్ని మురికి నీటి కాలువలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, డ్రై వేస్ట్ ఎక్కడా కనిపించకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, పీపీఈ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జి. అనిల్ కుమార్, సర్పంచ్ సుందిళ్ల శంకరమ్మ, ఉప సర్పంచ్ నల్లల మహేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పలువురు నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యువత ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



**ముద్ర, జగిత్యాల:** యువత ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు 11 రకాల పుస్తకాలను ఆయన చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ ముందు చూపుతో చేసిన ప్రయత్నం ఎంతో గొప్పదని అభినందించారు. ఈ పోటీ పరీక్షల్లో గెలుపొందడానికి 11 రకాల సూత్రాలను వివరించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. యువత డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నతం ఆశయం వైపు వెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిని నాశనం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**



**ముద్ర, మంచిర్యాల:**
కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లుగా సింగరేణి సంస్థను సర్వనాశనం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ఇటీవల ఆయనపై కేసు నమోదయిన నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు ఆదివారం హాజరయ్యారు. అనంతరం బాల్క సుమన్ మాట్లాడుతూ జిల్లా లోని క్యాతనపల్లి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో మెజారిటీ స్థానాలు బీఆర్ఎస్–సీపీఐ కూటమి గెలుచుకుందని పేర్కొన్నారు. మెజారిటీ స్థానాలు గెలుచుకున్నప్పటికీ చైర్‌పర్సన్ ఎన్నిక జరకుండా కాంగ్రెస్ కుట్రలు పన్నుతుందని విమర్శించారు. ప్రజా తీర్పునకు వ్యతిరేకంగా దౌర్జన్యంగా చైర్మన్ పీఠం దక్కించుకోవాలని మంత్రి వివేక్ వెంకటస్వామి కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. గత నెల 16, 17వ తేదీల్లో చైర్‌పర్సన్ ఎన్నిక జరకుండా వివేక్ అడ్డుకున్నారని తెలిపారు. తనతో సహా 25 మంది బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టారని అన్నారు. మందమర్రి ఏరియాలో కాసిపేట 2 ఇంక్లెన్ బొగ్గు గని తెచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే నని తెలిపారు. సింగరేణి ఏరియాలో మూడు వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత నాటి సీఎం కేసీఆర్‌దే నని స్పష్టం చేశారు. మంత్రి వివేక్‌కు ఈ ప్రాంతంపై ప్రేమ ఉంటే కొత్త భూగర్భ గనులు తీసుకురావాలని సూచించారు. హైకోర్టు తీర్పు ప్రకారం క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నికను అధికారులు ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో పాలకులు తప్పకుండా భారత రాజ్యాం గాన్ని గౌరవించాలన్నారు.

# అంబటి కవిత్వంతో సామాజిక చైతన్యం

**- పుడమిని ముద్దాడిన పొద్దు పుస్తకావిష్కరణ**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
అంబటి కవిత్వం సామాజిక చైతన్యానికి ప్రతీక అని పలువురు వక్తలు కొనియాడారు. నిర్మల్ కు చెందిన అంబటి నారాయణ రచించిన పుడమిని ముద్దాడిన పొద్దు కవితా సంపుటిని ఆదివారం పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ కవి గుడిపాటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సామాజిక సాంస్కృతిక కళా తాత్వికపరమైన కవిత్వం ఇందులో దాగి ఉందన్నారు. ప్రతిరోజు సూర్యుడు ఉదయించకముందే అంబటి కవిత్వం సామాజిక మాధ్యమ సమూహాల్లో ప్రత్యక్షమవుతుందని కొనియాడారు. అనునిత్యం ఉదయాన్నే ఓ కొత్త కవితతో అంబటి పలకరించగలడని పేర్కొన్నారు. వస్తువులో వైవిధ్యం, అభివ్యక్తిలో విలక్షణత దాగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనజ్వాల, మరికంటి, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, తోడిశెట్టి పరమేశ్వర్, మునీంద్రరాజు, బి.వెంకట్, డా అప్పాల చక్రధారి, నేరెళ్ల హన్మంతు, నివేదిత, ఎం.సి.లింగన్న, డాక్టర్ దామెర రాములు, పత్తి శివప్రసాద్, పోలీస్ భీమేశ్, బొందిడి పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్యులు మరింత అభివృద్ధి చెందాలి



**ముద్ర, జగిత్యాల:** ఆర్య వైశ్యులు మరింత అభివృద్ధి చెందాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో ఆదివారం ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్య వైశ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్లు తిరుమల వసంత, మైలారపు లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

## జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన సీఐటీయూ నాయకులు**



**ముద్ర, ఆదిలాబాద్:** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను సీఐటీయూ అధ్యక్షుడు ఆశన్న కోరారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రస్తావించాలని కోరారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మల్టిపర్పస్ విధానం రద్దు చేయాలని విన్నవించారు. గ్రామా పరిశుభ్రతలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులను పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.కాగా పంచాయతీ కా ర్మికుల సమస్యలు పరి ష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# నిర్మల్ లో సినీ నటి ఐశ్వర్యా రాజేష్ సందడి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వండర్ ల్యాండ్ ప్రారంభోత్సవానికి సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్ సినీ నటి ఐశ్వర్యా రాజేష్ ఆదివారం వచ్చారు. ఆమె నిర్మల్, ముధోల్ ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్ లతో కలిసి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు వందల ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న నిర్మల్ కు రావటం ఆనందంగా ఉందన్నారు. నిర్మల్ బొమ్మలకు అంతర్జాతీయ ఖ్యాతి ఉందని తెలిపారు. కాగా ఆమెతో ఫొటోలు దిగేందుకు, చూసేందుకు ప్రజలు భారీగా వచ్చారు.



# మేడిగడ్డ దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి



**మహదేవపూర్, ముద్ర:**
మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, నాణ్యత లోపాలపై తక్షణమే విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ప్రతినిధి బృందం మేడిగడ్డ (లక్ష్మి), అన్నారం (సరస్వతి), పార్వతి (సుందిళ్ల) బ్యారేజీలతో పాటు మేడవరం పంపింగ్ హౌస్‌ను క్షేత్ర స్థాయిలో సందర్శించారు. అక్కడ కుంగిపోయిన పియర్, దెబ్బతిన్న గేట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం నాయకులు మాట్లాడుతూ మేడిగడ్డ ప్రాజెక్టు నాణ్యత లోపాలపై విచారించడంతో పాటు బాధ్యులైన అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. సుమారు ₹90 వేల కోట్ల నుంచి లక్ష కోట్ల వరకు ప్రజా ధనాన్ని వెచ్చించిన ఈ ప్రాజెక్టులో జరిగిన నష్టం ఆందోళనకరమన్నారు. ఈ వైఫల్యానికి మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వమే ప్రాథమిక బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.సుదర్శన్, బి.వెంకట్, సాయిబాబు, నున్నా నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు మధు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర



**ముద్ర, జగిత్యాల:** జగిత్యాల జిల్లాలోని కోరుట్లలో ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం పట్టణ శాఖ ఆధ్వర్యంలో సాహస యాత్ర (సైకిల్ యాత్ర) నిర్వహించారు. నగరంలోని వివేకానంద, గురూజీ, భగత్ సింగ్ శాఖలకు చెందిన 60 మంది నాలుగు కిలో మీటర్ల దూరంలోని కల్లూరు వరకు సైకిల్ యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా వారు చేసిన దేశభక్తి గీతాలాపనలు, నినాదాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ నాయకులు మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం యువత ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ వ్యవస్థ ప్రముఖ్ శివకుమార్, నగర కార్యవాహ గట్ల ప్రవీణ్, బౌద్ధిక్ ప్రముఖ్ నారవేని వేణు, వ్యవస్థ ప్రముఖ్ గంగుల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి తీరంలో మృతదేహం లభ్యం

**ముద్ర, జగిత్యాల:**
జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గోదావరి తీరంలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గోదావరి తీరంలో చేపల వేటకు వెళ్లిన ఓ జాలరికి నీటిలో కొట్టుకు వస్తున్న మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని ఆయన ఆలయ వాచ్‌మెన్ సాయంతో సర్పంచ్ పర్స కోటయ్యతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరి శీలించారు. మృతుడి వయసు 40–50 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**ముద్ర, అసిఫాబాద్:**
హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. కుమ్రంభీం అసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామ పంచాయతీకి చెందిన ఇద్దరు వార్డు సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గోలేటి సర్పంచ్ ఆజ్మీర బాబూరావు ఆధ్వర్యంలో వార్డు సభ్యులు జుమ్మిడి అరుణ్, మిడిగొండ లక్ష్మి లింగమూర్తి ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 16-03-2026
www.mudranews.in | @mudranews



**వంటగ్యాస్ కొరత**
**పాత్రలు పొడిగా ఉంచండి**

తడి పాత్రలు స్టౌపై పెట్టితే వేడి ఎక్కువగా ఖర్చవుతుంది. అందుకే వండే ముందు పాత్రలను తుడిచేయడం మంచిది.



# కార్మికులు బాగుంటేనే పట్టణం బాగుంటుంది..





### - మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్

ముద్ర ప్రతినిధి, భువనగిరి :

కార్మికులు బాగుంటేనే పట్టణం బాగుంటుందని మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక చివరి రోజు ఆదివారం భువనగిరి పురపాలక సంఘం ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమం, పారిశుధ్య కార్మికులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్ పర్సన్ హాజరై శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికతో పట్టణంలో అన్ని వార్డులలో వార్డు సభ్యుల, పట్టణ ప్రజల, అధికారుల సహకారంతో 35 వార్డులలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, సిడిఎంఏ లావణ్య, మున్సిపల్ కమిషనర్ జి.రామలింగం కౌన్సిలర్లు బొంతల నర్సింగ్ రావు, గంజి శ్రీవాణి గణేష్ రెడ్డి, జాలిగం విగ్నేశ్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా లెక్కలను దిగ్విజయంగా పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి అనురాగ్ జయంతి

ముద్ర ప్రతినిధి, భువనగిరి :

2027 జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి ఎంతో కీలకమని, అధికారులు పూర్తి అవగాహనతో, క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేసి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి అనురాగ్ జయంతి పేర్కొన్నారు. జిల్లాలో జనాభా గణన–2027 సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి ఆదివారం కలెక్టర్ సమావేశ మందిరం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన నిబంధన ప్రకారం క్షేత్రస్థాయిలో అధికారులు పక్కాగా సర్వే నిర్వహించి జనాభా గణన చేయాలన్నారు. జిల్లా స్థాయిలో జనాభా గణనను సమర్థమంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.





ఈ జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో హౌస్ లిస్టింగ్ (ఇళ్ల జాబితా) గృహాల గణన మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు, రెండో దశలో జనాభా గణన 2027 ఫిబ్రవరిలో జరుగుతుందని వివరించారు. జనన గణన 1872 లో మొదటి పాపులేషన్ సెన్సస్ చేయడం జరిగిందని అప్పుడు జరిగిన సెన్సస్ గురించి ఆన్లైన్ వెబ్ లో చూసి అవగాహన చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈసారి జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. సెన్సస్ డిజిటల్ గా మారిపోయిందని క్రియే షన్స్ చేసుకోవడం చాలా సులభకరంగా ఉంటుందని, ఎవరి మొబైల్ ఫోన్లో వారే సొంతంగా అప్లికేషన్లు డౌన్లోడ్ చేసుకొని సర్వే చేయవచ్చని అన్నారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి ముందు అందుబాటులో ఉంచనున్నట్లు స్పష్ట చేశారు.



మొదటి దశలో నిర్వహించే ఇళ్ల జాబితా, గృహాల గణనలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థాలు, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, తాగునీటి సౌకర్యం, మురుగు నీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంట గది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు లాంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 34 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరిస్తారని వివరించారు.

మూడు రోజులలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, ఆర్డీవోలు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి, జిల్లా సెన్సెస్ అధికారి వెంకట రమణ , మున్సిపల్ కమీషనర్ లు, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపిడిఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు

### - జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర ప్రతినిధి, భువనగిరి :

జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు. జిల్లాలో గృహ వినియోగానికి అవసరమైన గ్యాస్ సరఫరా సాధారణంగా కొనసాగుతోందని, గ్యాస్ ఏజెన్సీల ద్వారా సిలిండర్ల సరఫరా నిరంతరం జరుగుతోందని తెలిపారు. ఎక్కడైనా సిలిండర్ల కొరత ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైనంత గ్యాస్ నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అనవసరంగా ఎక్కువ సిలిండర్లు బుక్ చేసుకోవడం లేదా నిల్వ చేసుకోవడం చేయవద్దని కోరారు.

# స్వర్ణగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ..

### - ఘనంగా రథోత్సవం



ముద్ర ప్రతినిధి, భువనగిరి :

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రం పురస్కరించుకొని ఆదివారం స్వర్ణగిరి క్షేత్రంలో అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. ఆదివారం ఏకాదశిని పురస్కరించుకొని శ్రీ స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు నవ కలుశ పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. ముందుగా కొండ కింద ఉన్న శ్రీ వారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అనంతరం గోవింద నామ స్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ గావించారు. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు మంచి నీరు, మజ్జిగ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. క్షేత్రంలో ఈరోజు సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవ సేవ నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో రథంపై శోభాయ మానంగా గోవింద నామస్మరణతో మంగళ ధ్వనుల మధ్య ఘనంగా ఊరేగించారు.

### ఎమ్మెల్యే సామేల్
# హిందువులకు క్షమాపణ చెప్పాలి

### - తుంగతుర్తి సర్పంచి మల్లె పాక సాయిబాబు

ముద్ర, తుంగతుర్తి:

ఇటీవల హైదరాబాదులోని గాంధీ భవన్ లో జరిగిన కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హిందూ ధర్మానికి అవమానం కలిగే విధంగా మాట్లాడారని, దానికి వెంటనే క్షమాపణ చెప్పాలని అన్నారు. ఆదివారం విలేకరులతో సర్పంచి మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడే బ్రాహ్మణుల పట్ల అసభ్యంగా మాట్లాడడం ఎంత మాత్రం తగదని అన్నారు. హిందూ ధర్మాన్ని అగౌరవ పరిచే మాటలు మాట్లాడటం కాంగ్రెస్



పార్టీ విధానమా, లేక సామేల్ విధానమా అని ప్రశ్నించారు. ఎవరికి నచ్చిన మతం వాళ్ళు ఆచరించవచ్చుఅని, కాని పరాయి మతాన్ని కించపరచడం తగదని అన్నారు ఎమ్మెల్యే వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేద వాడి కల

### - కౌన్సిలర్ తోటకూరి విజయ లక్ష్మి వెంకటేష్ యాదవ్

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేదవాడి కల అని కౌన్సిలర్ తోటకూరి విజయలక్ష్మి వెంకటేష్ యాదవ్ అన్నారు. భువనగిరి పట్టణంలోని 12 వార్డ్ లో నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశానికి కౌన్సిలర్ హాజరై నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కొన్ని లక్షలు మంది ఇండ్ల నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి, పద్మ బిక్షపతికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# ముస్లింలకు ఇఫ్తార్ విందు

### - పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

ముద్ర ప్రతినిధి, భువనగిరి :

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా మైనార్టీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక వైయస్సార్ గార్డెన్ లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలు చేస్తారని అన్నారు. రంజాన్ పండుగను శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





# రబీ ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ముద్ర, వరంగల్:

జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను నిర్వహించేందుకు అన్ని శాఖలు ముందస్తు సన్నాహాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. రబీ 2025–26 ధాన్యం సేకరణ, 2024–25 సీఎంఆర్ డెలివరీ, ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ పత్రాల సమర్పణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. జిల్లాలో 2025–26 రబీ సీజన్‌లో సుమారు 2 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సుమారు 240 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. రబీ 2024–25 సీఎంఆర్‌ను 100 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ 2025-26 సీఎం ఆర్ డెలివరీ వేగవంతం చేయాలన్నారు. గోదాముల్లో ధాన్యం నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. రైస్ మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ పత్రాలను తప్పనిసరిగా సేకరించాలని అన్నారు. రాబోయే ఏప్రిల్ రెండో వారంలో రబీ ధాన్యం కొనుగోలు ప్రారంభం అయ్యే అవకాశం ఉన్నందున మార్కెటింగ్ శాఖ ద్వారా అవసరమైన టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు, వేయింగ్ మిషన్లు, ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు తదితర సామాగ్రిని ముందుగానే సమకూర్చుకుని సిద్ధంగా ఉండాలని సూచించారు.





ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న బియ్యం ఎలాంటి దుర్వినియోగం జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీఓ రామ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి నీరజ, సంబంధిత శాఖల అధికారులు, జిల్లాలోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మండుతున్న వేసవి ఎండలు



## జోరందుకున్న కూలర్ల అమ్మకాలు.. వెలసిన జ్యూస్ సెంటర్లు

ముద్ర, ప్రతినిధి భువనగిరి :

తెల్లవారుజామున చల్లని వాతావరణం ఉన్నప్పటికీ ఉదయం 8 గంటలు దాటితే ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగి 32 డిగ్రీలు దాటుతోంది. ప్రజలు ఇంటికి పరిమితం కావడంతో, వాహనదారులు లేకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుషముగా మారుతున్నాయి. కూలర్లు, ఫ్రిజ్లు, జ్యూస్ చేసే మిక్సీలు, టోపీలు అమ్మకాలు జోరు అందుకున్నాయి. సుమారు 200 కుటుంబాలు ఆంధ్ర రాయలసీమ ప్రాంతాల నుండి జ్యూస్ అమ్మకాలను నిర్వహించడానికి యాదాద్రి భువనగిరి జిల్లాకు తరలి వచ్చాయి. ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాలలో జ్యూస్ సెంటర్లున ఏర్పాటు చేసుకొని అమ్మకాలు చేస్తున్నారు. రాజస్థాన్ నుండి చెరుకు రసం అమ్మే యంత్రాలు తీసుకు వచ్చి చెరుకు రసం అమ్మకాలు చేస్తున్నారు.

### దాహార్తికి ప్రజల ఇబ్బంది..

బస్టాండ్ లో, పెట్రోల్ బంకుల వద్ద, వివిధ కుడళ్ల వద్దకి వచ్చిన ప్రజలు తాగు నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వివిధ చౌరస్తాల వద్ద ప్రభుత్వం లేక స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పేదలు, సామాజిక స్పృహ ఉన్నవారు తాగునీటి చల్లదనానికి కుండలు కొనుగోలు చేస్తున్నారు.

### జాగ్రత్తగా ఉండాలి..

ఎండల నుండి జాగ్రత్త పడాలని ప్రజలు తమ పనులను ఉదయం సాయంత్రం వేళలో చేసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున వాటిని తట్టుకోవడానికి టోపీలు, కళ్లద్దాలు, గొడుగులు వాడాలని సూచిస్తున్నారు. సన్ స్క్రీన్ మాశ్చరైజ్ శరీరానికి రాసుకోవాలని సూచిస్తున్నారు.

### నేటి నుంచి ఒంటిపూట బడులు..

వేసవిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16 నుంచి ఒంటిపూట బడులు నడపాలని నిర్ణయించింది.



**వంటగ్యాస్ కొరత : సరైన సైజు పాత్రలు వాడండి**

చిన్న వంటకు పెద్ద పాత్రలు వాడితే వేడి ఎక్కువగా అవసరం అవుతుంది. వంటకు సరిపోయే పాత్రలు వాడాలి.

## పిల్లలను ఒంటరిగా ఈతకు పంపొద్దు

- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచన

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



పిల్లలకు ఒంటిపూట బడులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లల ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. పిల్లలకు నీటి లోతు తెలియకపోవడం వల్ల జారి నీటిలో పడిపోయే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ఒకవేళ పిల్లలకు ఈత నేర్పించాలని అనుకుంటే తల్లిదండ్రులు లేదా పెద్దల పర్యవేక్షణలోనే నేర్పించాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లల సరదా తల్లిదండ్రులకు జీవితాంతం మిగిలే విషాదంగా మారకూడదని అన్నారు. గ్రామాల్లోని బావులు, చెరువుల వద్ద భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

### జాతీయ సమైక్యతా శిబిరానికి

## తారా కళాశాల విద్యార్థిని ఎంపిక

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**





కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా కర్ణాటకలోని కర్ణాటక విశ్వవిద్యాలయం, ధార్వాడ్‌లో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యతా శిబిరానికి తారా కళాశాలకు చెందిన గీత (బీఏ ద్వితీయ సంవత్సరం) ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. యువతలో జాతీయ సమైక్యతను, భిన్నత్వంలో ఏకత్వ భావనను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ దేశంలోని వివిధ రాష్ట్రాలలో జాతీయ సమైక్యతా శిబిరాలను నిర్వహిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ్ విశ్వవిద్యాలయంలో ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు జరుగుతున్న జాతీయ సమైక్యతా శిబిరానికి తమ కళాశాల విద్యార్థిని గీత (బీఏ ద్వితీయ సంవత్సరం) ఎంపికై పాల్గొంటున్నట్లు తెలిపారు. తెలంగాణ నుంచి బయలుదేరిన పది మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల బృందంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. అందులో తమ కళాశాలకు చెందిన గీత ఉండడం గర్వకారణమని చెప్పారు. ఈ శిబిరంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శిస్తూ రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకువస్తున్నారని తెలిపారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాలు ప్రదర్శించే సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, ఆచార వ్యవహారాలను తెలుసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థిని ఎంపిక చేసినందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ కుమార్ గారికి, అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద మృతులకు కన్నీటి వీడ్కోలు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ జిల్లా కుల్చారం మండలం రాంపూర్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురి అంత్యక్రియలు ఆదివారం వారి స్వగ్రామాల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయుల అశ్రునయనాల మధ్య నిర్వహించారు. హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన అమృత్ గౌడ్ (50), అతని కుమారుడు రిషి వర్ధన్ గౌడ్ (12), కూతురిని ఇచ్చిన బి. భూపతిపూర్ గ్రామానికి చెందిన అల్లుడు సాయాగౌడ్ (35)లు కుల్చారం మండలం రంగంపేట గ్రామంలో జరిగిన తమ బంధువు ఇంటి తొట్టెల కార్యక్రమంలో పాల్గొని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదానికి గురైన సంగతి తెల్సిందే. తండ్రి, కుమారుడు అయిన అమృత్ గౌడ్, రిషి వర్ధన్ గౌడ్ అంత్యక్రియలను బూరుగుపల్లి గ్రామంలో ఒకే చోట నిర్వహించారు. అల్లుడు సాయాగౌడ్ అంత్యక్రియలు అతని స్వగ్రామం బి. భూపతిపూర్‌లో నిర్వహించారు. రెండు గ్రామాల్లో అంత్యక్రియలు పూర్తయ్యే వరకు కన్నీటి రోదనలు మిన్నంటాయి.

### ఎమ్మెల్యే రోహిత్ దిగ్భ్రాంతి..

ప్రమాదంలో ముగ్గురి మరణంపై ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెండు కుటుంబాలను పరామర్శించారు. భూపతిపూర్‌లో సాయాగౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య, తల్లిని పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యుల బాధను చూసి భావోద్వేగానికి గురయ్యారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పరశురాం గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, బూరుగుపల్లి సర్పంచ్ సాయిలు, మండల పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, బాలకిషన్ రావ్, సాయి బాబా తదితరులు ఉన్నారు.

### ముగ్గురు మరణించడం చాలా బాధాకరం : పద్మ దేవేందర్ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించడం చాలా బాధాకరమని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. బూరుగుపల్లిలో అమృత్ గౌడ్, రిషి వర్ధన్ గౌడ్ పార్థివ దేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఒకే ప్రమాదంలో తండ్రి, కుమారుడు, అల్లుడు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. అనంతరం బొగుడ భూపతిపూర్ గ్రామానికి చెందిన గోకని సాయ గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య, తల్లిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి మాజీ సర్పంచ్ చెన్నగౌడ్, హవేలీఘనపూర్ సర్పంచ్ సాయిలు, నాయకులు బాలరాజ్, రవీందర్ గౌడ్, సాపసాయిలు, రాంచంద్రం రెడ్డి, రాఘవ రెడ్డి, జీవన్ రెడ్డి, యాదగిరి, లక్ష్మిపతి, అరవింద్, కుమార్, సంతూ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

- ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**





రిటైర్డ్ ఉద్యోగులను రోడ్లపైకి తెచ్చిన ఘనత రేవంత్ రెడ్డిదేనని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న నిరాహార దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. 35 ఏండ్లు కష్టపడి పని చేసి రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులను రేవంత్ రెడ్డి రోడ్ల మీదకు తెచ్చాడన్నారు. ఎన్నికల ముందు పెండింగ్ డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇవ్వడానికి కూడా రేవంత్ రెడ్డికి మనసు రావడం లేదన్నారు. పదివేల కోట్ల బకాయిలు ఇవ్వాలని రిటైర్డ్ ఉద్యోగులు అడిగితే 'నా దగ్గర కోసుకుని తినడానికి డబ్బులు లేవు' అని అంటున్నారని విమర్శించారు. 96 వేల కోట్ల పనులకు టెండర్లు పిలుస్తూ, మూసి అభివృద్ధి కోసం లక్ష 50 వేల కోట్లు పెట్టి 10 వేల ఇండ్లు కూల్చడానికి సిద్ధమయ్యారని ఎద్దేవా చేశారు. బడా కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లిస్తారని, ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు డబ్బులు ఇస్తారని, కానీ ఉద్యోగులకు మాత్రం ఇవ్వడంలేదని ఆరోపించారు. కమీషన్ ఇచ్చే వారికి డబ్బులు ఇస్తారని, కమీషన్ ఇవ్వని ఉద్యోగులకు ఇవ్వడం లేదన్నారు. రిటైర్డ్ పెన్షన్ బెనిఫిట్లు రాక 60 మంది చనిపోయారని, వారి చావుకు రేవంత్ రెడ్డే కారణమని అన్నారు. ఎన్ని ప్రాణాలు పోతే రేవంత్ రెడ్డి కళ్లుతెరుస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు నెలలోపే బెనిఫిట్లు ఇచ్చామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో 92 వేల ఉద్యోగులు రిటైర్డ్ అయితే వెంటనే డబ్బులు చెల్లించామని తెలిపారు. ఉపాధ్యాయులను అవమానించేలా విద్యా కమిషన్ నివేదిక ఉందన్నారు. మల్లన్న సాగర్ నుంచి మూసికి నీటిని తరలించేందుకు డబ్బులు ఉన్నాయని, కానీ రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వడానికి డబ్బులు లేవా అని ప్రశ్నించారు. రైతులకు డబ్బులు ఇవ్వలేదని, మహాలక్ష్మి ఇస్తామని మహిళలను మోసం చేశారని ఆరోపించారు. ఉద్యోగుల గొంతుకగా అసెంబ్లీలో పోరాటం చేసి వారికి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులను రోడ్డుపైకి తెచ్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. ఉద్యోగులు సంఘటితం అయి ప్రభుత్వంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత లక్ష యాభై ఐదు వేల కోట్ల అప్పులు తెచ్చిందన్నారు. మూడు లక్షల కోట్ల బడ్జెట్ పెడుతున్న రేవంత్ రెడ్డి అందులో పదివేల కోట్లు రిటైర్డ్ ఉద్యోగుల కోసం కేటాయించాలని సలహా ఇచ్చారు.

## దేశాభివృద్ధికి జనాభా లెక్కలు కీలకం

- మొదటిసారి డిజిటల్ పద్ధతిలో జనగణన
- అదనపు కలెక్టర్ నగేష్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



2027 జనాభా లెక్కలు ప్రభుత్వ పథకాల అమలుకు కీలకమని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. అధికారులు పూర్తి అవగాహనతో క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేసి జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలో జనాభా గణన 2027ను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో జనాభా గణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహాల గణన మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించగా, రెండో దశలో జనగణన 2027 ఫిబ్రవరిలో జరుగుతుందని వివరించారు. మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని తెలిపారు. మండల స్థాయిలో తహసీల్దార్, మున్సిపాలిటీలో కమిషనర్ ఇంచార్జ్‌లుగా వ్యవహరిస్తారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల ప్రణాళికలు రూపొందించేందుకు జనాభా గణన ద్వారా లభించే గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈసారి దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో జనగణన నిర్వహించనున్నట్లు తెలిపారు. మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే విధంగా ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. మొదటి దశలో నిర్వహించే ఇళ్ల జాబితా, గృహాల గణనలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థాలు, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, తాగునీటి సౌకర్యం, మురుగు నీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతోపాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరిస్తారన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎఫ్ఓ జోజి, ఆర్డీవోలు రమాదేవి, జై చంద్రా రెడ్డి, రామకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- రంజాన్ తోఫాలను పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



మైనారిటీల సంక్షేమం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తెలిపారు. సిద్దిపేటలో ఆదివారం విపంచి ఆడిటోరియంలో రంజాన్ పండుగ సందర్భంగా నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనారిటీలను పట్టించుకున్న పాపానా పోవడం లేదని ఆరోపించారు. ముస్లింలకు రిజర్వేషన్ పెంచుతామని చెప్పి 10 సంవత్సరాలు కేసీఆర్ ముస్లిం ప్రజలను మోసం చేశారని విమర్శించారు. దేశంలో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేసిన ముస్లిం రిజర్వేషన్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రం, దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం తప్ప మిగిలిన ఏ ప్రభుత్వం కూడా మైనారిటీల అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. మైనారిటీలు అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే దేశంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ వల్లే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అర్హులైన ముస్లింలకు త్వరలోనే స్కూటీలను అందజేస్తామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలంటే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరో 10 సంవత్సరాలు ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పయ్యావుల ఎల్లం రియాజుద్దీన్, పూజల గోపి, మీసం మహేందర్, షాబుద్దీన్, వహాబ్, గయాజుద్దీన్, రషద్, హర్షద్, విజయ్, డానియల్, అజ్మత్, మున్నా, సలీం, చెంది శ్రీనివాస్, బాబా, స్రవంతి, మైపాల్ రెడ్డి, చోటాస్మత్, దేశెట్టి నరేష్, మున్నా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ కోసం పడిగాపులు

**ముద్ర న్యూస్ :**

బాన్సువాడ పట్టణంలో గ్యాస్ సిలిండర్ కోసం ఆదివారం లబ్ధిదారులు బారులు తీరారు. ఎల్లారెడ్డి మెయిన్ రోడ్డుపై సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట లబ్ధిదారులు క్యూలైన్‌లో నిల్చున్నారు. బుకింగ్ వ్యవధి 45 రోజులకు పెంచడంతో సిలిండర్ దొరుకుతుందో లేదో అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## ఇఫ్తార్ విందు

- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ, మాజీ ఎమ్మెల్సీలు ఫారూఖ్, శేరి హాజరు



మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుసేన్ కు ఖర్జూర తినిపిస్తున్న పద్మ దేవేందర్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ పట్టణంలోని క్రిస్టల్ గార్డెన్‌లో మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మత గురువు జావీద్ మౌలానా, మాజీ ఎమ్మెల్సీలు ఫారూఖ్ హుస్సేన్, శేరి సుభాష్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బట్టి జగపతి, మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు దీపక్, జుబేర్, గౌస్ కురేషి, సోహైల్, పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డమీది కృష్ణ గౌడ్, సురేందర్ గౌడ్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యం



**ముద్ర న్యూస్ :**

బాన్సువాడ నియోజకవర్గంలో పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ గ్రామంలో 20లక్షల వ్యయంతో నిర్మించనున్న జనరల్ ఫంక్షన్ హాల్‌కు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో బాన్సువాడ నియోజకవర్గానికి 11,000 రెండు పడక గదుల ఇళ్లను మంజూరు చేయించి, లబ్ధిదారులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో బాన్సువాడ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించి, వాటిని లబ్ధిదారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీతారామరాజు, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అరుణ్, దిశా రాష్ట్ర నాయకుడు నగేష్, తహసీల్దార్ తారాబాయి తదితరులు పాల్గొన్నారు.

### వంటగ్యాస్ కొరత : బర్నర్ శుభ్రంగా ఉంచండి

బర్నర్‌లో దుమ్ము, మురికి ఉంటే మంట సరిగా రాదు. క్రమం తప్పకుండా శుభ్రం చేస్తే గ్యాస్ ఆదా అవుతుంది.



## ఇందిరమ్మ లబ్ధిదారులకు గుడ్ న్యూస్

- **ఇందిరమ్మ లబ్ధిదారులకు గుడ్ న్యూస్**
- **పాత బిల్లులు చెల్లింపు**
- **కీలక నిర్ణయం తీసుకున్న సర్కారు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఇందిరమ్మ లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. పెండింగ్ బకాయిల విడుదల పైన నిర్ణయం తీసుకుంది. ఎంతో కాలంగా బకాయిల కోసం వేచి చేస్తున్న లబ్ధి దారులకు రిలీఫ్ దక్కింది. తాజాగా విడుదల చేసిన నిధుల ద్వారా తొలి దశలో 2,764 మంది లబ్ధి దారుల కు ప్రయోజనం కలగనుంది. మిగిలిన బిల్లుల విషయంలోనూ ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని తాజాగా ప్రకటించింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇళ్లు మంజూరై నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులకు తాజాగా నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పెండింగ్ బిల్లులను చెల్లించింది. వీటిని నేరుగా లబ్ధిదారుల అకౌంట్లో జమ చేసింది. మొత్తం 2,764 మంది లబ్ధిదారులకు రూ.28.50 కోట్లు మంజూరు చేసింది. 99 రోజుల కార్యక్రమాన్ని ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం ప్రారంభించిన వారం రోజుల్లో లబ్ధిదారు లకు నిధులు విడుదల చేసింది. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించినట్లు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌతం ప్రకటించారు. ఇదే సమయంలో పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ చేసింది. క్లియర్ చేసేందుకు చర్యలు చేపడుతోంది.

**దశల వారీగా చెల్లింపులకు సమాయత్తం**

ప్రభుత్వం బిల్లుల విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలతో ఇళ్ల నిర్మాణాలు మరింతగా వేగం పెరిగే అవకాశం కనిపిస్తోంది. సాంకేతిక సమస్యల వల్ల డబ్బులు జమ కాని లబ్ధిదారులకు కూడా అందించేందకు ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతోంది. గత వారం రోజుల్లో ఎల్ 3 జాబితాలో ఉన్న 1200 మందికి రూ.12.06 కోట్లు విడుదల చేశారు. ఇక బ్యాంక్ వద్ద పెండింగ్‌లో ఉన్న 653 మందికి కూడా రూ.7 కోట్లు విడుదల చేశారు. ఇక అభ్యంతరాల తర్వాత పెండింగ్‌లో పడ్డ 911 మంది లబ్ధిదారులకు కూడా రూ.9.40 కోట్లు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, తొలి విడతలో 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ఇక రెండో విడత జాబితాను త్వరలో విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఏప్రిల్ లో రెండో విడత జాబితా కింద మరికొంతమందిని ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తాజాగా ప్రభుత్వం వెల్లడించింది.

## ప్రైవేటుకు అబ్బాయిలు, సర్కారుకు అమ్మాయిలు!

- **21వ శతాబ్దంలోనూ లింగ వివక్ష**
- **పాఠశాల విద్యలో అసమానతలు**
- **వివక్ష ప్రదర్శిస్తున్న తల్లిదండ్రులు**
- **వెల్లడించిన 2026 యూ డైస్ నివేదిక**

**ముద్ర, గద్వాల :**


అక్షరాస్యత పెరుగుతున్నా, సాంకేతికత అభివృద్ధి చెందుతున్నా విద్యా వ్యవస్థలో లింగ వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉందని తాజా యూ డైస్ 2026 నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ విషయంలో తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో మార్పు రాకపోవడం గణాంకాలు చెబుతున్నాయి. అబ్బాయిల భవిష్యత్తు కోసం ఖరీదైన ప్రైవేటు విద్యను ఎంచుకుంటున్న తల్లిదండ్రులు, అమ్మాయిల విషయంలో మాత్రం ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. నివేదిక ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మాయిల శాతం ఎక్కువగా ఉండగా, ప్రైవేటు పాఠశాలల్లో అబ్బాయిలే అధికంగా ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 52 శాతం మంది అమ్మాయిలు ఉండగా, ప్రైవేటు పాఠశాలల్లో 54 శాతం మంది అబ్బాయిలు చదువుతున్నారు. దీనివల్ల ప్రైవేటు విద్యాసంస్థల్లో అమ్మాయిలతో పోలిస్తే సుమారు నాలుగు లక్షల మంది అబ్బాయిలు ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 26,81,580 మంది విద్యార్థులు ఉండగా, అందులో 13.94 లక్షల మంది బాలికలు, 12.87 లక్షల మంది బాలురు ఉన్నారు. ఇక ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 47,51,692 మంది విద్యార్థులు ఉండగా, అందులో 26.73 లక్షల మంది బాలురు, 22.77 లక్షల మంది బాలికలు ఉన్నారు. ఇక ఉన్నత విద్యలో కూడా కోర్సుల ఎంపికలో లింగ ఆధారిత తేడాలు కనిపిస్తున్నాయి. బీఎస్సీ కోర్సుల్లో 64 శాతం మంది అమ్మాయిలు చేరగా, అబ్బాయిలు 36 శాతం మాత్రమే ఉన్నారు. బీకాం కోర్సుల్లో అబ్బాయిలు 54 శాతం, అమ్మాయిలు 46 శాతం ఉన్నారు. బీఏ కోర్సుల్లో అబ్బాయిలు 58 శాతం ఉండగా, అమ్మాయిలు 42 శాతం మాత్రమే ఉన్నారు.
సామాజిక వర్గాల వారీగా చూస్తే ఎస్టీ విద్యార్థులు అధికంగా బీఏ కోర్సులను ఎంచుకుంటుండగా, ఎస్సీ మరియు బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు బీఎస్సీ కోర్సులపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఓసీ వర్గాల్లో మాత్రం బీకాం కోర్సుల్లో ప్రవేశాలు అధికంగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ఈ అసమానతలకు ప్రధానంగా ఆర్థిక పరిస్థితులు మరియు సామాజిక దృక్పథాలే కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రైవేటు విద్య ఖరీదైనదిగా ఉండటంతో కుటుంబాలు ప్రాధాన్యత క్రమంలో అబ్బాయిలను మాత్రమే ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే “అమ్మాయిలకు ఖరీదైన చదువులు అవసరం లేదు” అనే పాత తరపు భావజాలం, ఇంటి పనులు నేర్చుకోవాలనే అభిప్రాయాలు ఇప్పటికీ అనేక కుటుంబాల్లో కొనసాగుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రభుత్వాలు విద్యలో సమానత్వం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ, సమాజంలో ఆలోచనా విధానంలో మార్పు రాకపోతే లింగ వివక్ష పూర్తిగా తొలగిపోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




## ఎంపీ పుట్టా మహేష్ డ్రగ్స్ వ్యవహారం.. చంద్రబాబు సీరియస్

**ముద్ర, అమరావతి :**

ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు సంబంధించిన డ్రగ్స్ వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రగ్స్ వంటి అంశాల్లో ఎవరైనా ఉన్నా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ.. పుట్టా మహేష్‌ను తాత్కాలికంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. అలాగే ఘటనపై పూర్తి వివరణ ఇవ్వాలని సూచిస్తూ ఆయనకు నోటీసులు జారీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మొయినాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన డ్రగ్స్ పార్టీ తెలుగు రాష్ట్రాల్లో పెద్ద సంచలనం సృష్టించింది. ఈ పార్టీలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కూడా పాల్గొన్నట్లు వార్తలు రావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. మొదట ఆయన యూరిన్ నమూనాల్లో డ్రగ్స్ నెగటివ్‌గా వచ్చినప్పటికీ తర్వాత తీసుకున్న బ్లడ్ శాంపిల్స్‌లో డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు సమాచారం బయటకు రావడం వివాదానికి కారణమైంది. ఇప్పటికే ఈ ఘటనను ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా వైసీపీ నేతలు ఈ అంశాన్ని పెద్ద ఎత్తున ప్రస్తావిస్తూ టీడీపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా చేస్తామని చెప్పే ప్రభుత్వం, తమ పార్టీకి చెందిన ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పుట్టా మహేష్ డ్రగ్స్ కేసులో పట్టుబడటం రాష్ట్ర ప్రజలకు అవమానకరమని.. ఆయన ఎంపీగా కొనసాగేందుకు అర్హత లేదని వైసీపీ నాయకులు మండిపడుతున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఒక ఎంపీ ఇలాంటి పార్టీల్లో పాల్గొనడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆమె విమర్శించారు. డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన తర్వాత చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని ఆమె ప్రశ్నించారు. సమాజానికి ప్రజాప్రతినిధులు ఆదర్శంగా ఉండాల్సిన సమయంలో డ్రగ్స్ వినియోగం యువతకు తప్పు సందేశం ఇస్తుందని షర్మిల వ్యాఖ్యానించారు.ఈ నేపథ్యంలో టీడీపీపై ఒత్తిడి పెరుగుతున్న పరిస్థితి ఏర్పడింది. గతంలో అవినీతి, నేరారోపణలు ఎదుర్కొన్న నేతలపై కఠిన చర్యలు తీసుకున్న చంద్రబాబు.. ఈ వ్యవహారంలో కూడా కఠిన వైఖరి అవలంబించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే పుట్టా మహేష్‌పై వచ్చిన ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న చంద్రబాబు.. ఘటనపై పూర్తి నివేదిక తనకు సమర్పించాలని పార్టీ నాయకత్వానికి ఆదేశించారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని చంద్రబాబు ఆదేశించినట్టు సమాచారం. నేతల వ్యక్తిగత బలహీనతలు లేదా తప్పుల కారణంగా పార్టీకి నష్టం కలిగే పరిస్థితి రానివ్వనని ఆయన స్పష్టం చేశారు. ఘటనపై వివరణ కోరుతూ మహేశ్‌కు నోటీసులు ఇవ్వాలని, పూర్తి నివేదిక తనకు సమర్పించాలని పార్టీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు సూచించారు. డ్రగ్స్ కేసుల్లో ఎవరున్నా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మొత్తానికి డ్రగ్స్ వివాదం ఇప్పుడు టీడీపీకి పెద్ద తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.





## మిస్టర్ రంగనాథ్.. జాగ్రత్త

- **నీ పై దిఫమేషన్ కేసు వేస్తా.. కోర్టుకు లాగుతా'**
- **హైడ్రా కమిషనర్‌కు కవిత వార్నింగ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కల్వకుంట్ల కవిత వార్నింగ్ ఇచ్చారు. మిస్టర్ రంగనాథ్ మిమ్మల్ని కోర్టుకు ఈడ్చుకుని వెళ్తా జాగ్రత్త అంటూ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో వీడియోలు పోస్టు చేశారని ఆరోపిస్తూ, వెంటనే వాటిని తొలగించకపోతే డిఫమేషన్ కేసు వేస్తానని ఆమె హెచ్చరించారు. ఆదిత్య రియల్టర్స్ నిర్మాణాల విషయంలో గతంలోనే హైడ్రా అధికారులు ఆక్రమణలు జరిగినట్లు లేఖలు రాశారని కవిత తెలిపారు. అదే అంశంపై తాము ధర్నా చేస్తే ఇప్పుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. హైడ్రా అధికారిక ఎక్స్ ఖాతాలో వాయిస్ ఓవర్‌తో వీడియోలు పోస్టు చేయడం సరైన పద్ధతి కాదని ఆమె మండిపడ్డారు. మార్చి 3వ తేదీన నిర్వహించిన తమ నిరసనకు ఆరు నెలల ముందే సంబంధిత నిర్మాణంలో ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారని కవిత వివరించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. పేదల ఇళ్లను మాత్రమే కూల్చుతూ పెద్దల నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంపై కూడా కవిత ప్రశ్నించారు. గత ప్రభుత్వ కాలంలో రివర్‌బెడ్‌లో నిర్మాణాలకు అనుమతి ఇవ్వలేదని, ఇప్పుడు ఎందుకు ఇస్తున్నారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్ట్ పేరుతో రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంక్ వద్ద తాకట్టు పెడుతున్నారని గతంలోనే తాము హెచ్చరించామని చెప్పారు. ప్రాజెక్ట్‌కు సంబంధించి పూర్తి డీపీఆర్ ఇప్పటికీ లేదన్నారు. ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలు ఏమిటో ప్రభుత్వం వెల్లడించడం లేదని కవిత విమర్శించారు. ప్రాజెక్ట్ ఖర్చు కూడా ఆరు నెలల్లోనే భారీగా పెరిగిందన్నారు. మూసీ అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు కూల్చడం సరైంది కాదని, బాధితులతో చర్చించి వారికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. వెలుగుమట్ల బాధితుల సమస్యపై ఈ నెల 17న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ జాగృతి పోరాటం కొనసాగిస్తుందని కవిత స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే హైడ్రా ఎక్స్‌లో పెట్టిన వీడియోలను ఈ రోజు సాయంత్రం వరకు తొలగించకపోతే కోర్టులో కేసు వేస్తానని కవిత మరోసారి హెచ్చరించారు. 'మిస్టర్ రంగనాథ్. నీ పై దిఫమేషన్ కేసు వేస్తా.. నిన్ను కోర్టుకు లాగుతా.' అంటూ కవిత తీవ్రస్థాయిలో సవాల్ విసిరారు.



## కావూరు కుటుంబ సభ్యులకు చంద్రబాబు పరామర్శ

**ముద్ర, హైదరాబాద్ :**

కేంద్ర మాజీ మంత్రి కావూరు సాంబశివ రావు నీతి, నిజాయతీతో రాజకీయాలు చేశారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన నాయకుడని గుర్తుచేశారు. అలాంటి నేతను కోల్పోవడం తీరని లోటని అన్నారు. హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని కావూరు నివాసంలో ఆయన కుటుంబ సభ్యుల్ని చంద్రబాబు పరామర్శించారు. కావూరు చిత్రపటానికి నివాళులర్పించారు. చంద్రబాబుతోపాటు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కూడా సాంబశివరావు కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కుటుంబసభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. హైదరాబాద్‌లోని హెచ్‌జే దొర నివాసానికి వెళ్లి.. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

## శ్రీవారి భక్తులకు హైటెక్ అన్నదానం..

- **రిలయన్స్ భారీ విరాళం**
- **రూ.120 కోట్లతో ఆధునిక వంటశాల నిర్మాణం..**

**ముద్ర, తిరుమల :**

తిరుమల వచ్చే శ్రీవారి భక్తులకు నాణ్యమైన, రుచికరమైన వంటకాలను అందించే లక్ష్యంతో భారీ వంటశాల నిర్మాణానికి టీటీడీ చర్యలు చేపట్టింది. రిలయన్స్ సంస్థ సహకారంతో రూ. 120 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అధునాతన వంటశాల నిర్మించనుంది. వంటశాలతో పాటు డైనింగ్ హాల్స్ ఏర్పాటు చేయనున్నారు. వంట విధానం, ప్రసాదాల పంపిణీని ఆటోమేషన్ చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా టీటీడీ అన్నదానంలో మార్పులకు శ్రీకారం చుడుతోంది.

**రిలయన్స్ రూ.120 కోట్ల విరాళం**

కలియుగ వైకుంఠ నాథుడి దర్శనానికి ప్రపంచం నలుమూల నుంచి వచ్చే భక్తులకు నాలుగు దశాబ్దాలుగా ఉచిత అన్నదాన వితరణ చేస్తున్నారు. అయితే సేవలను మరింత విస్తృతం చేయడానికి టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోంది. పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా తరిగొండ వెంకమాంబ అన్నవితరణ కేంద్రాన్ని ఆధునికీకరించడంతో పాటు విస్తరించడానికి చర్యలు చేపడుతోంది. ఒకేసారి నాలుగు వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించేందుకు వీలుగా నిర్మించిన వెంగమాంబ అన్నదాన సత్రం భక్తుల రద్దీ పెరగడంతో ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో రిలయన్స్ సంస్థ అన్నదాన సత్ర నిర్మాణానికి రూ. 120 కోట్లను విరాళంగా ఇవ్వడానికి ముందుకొచ్చింది.



## అన్నవరం పరిసరాల్లో పులి..

**భక్తులను అప్రమత్తం చేసిన అధికారులు**

**ముద్ర న్యూస్ :**

కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు నియోజకవర్గంలో 16 రోజులుగా పులి సంచరిస్తోంది. శంకవరం, ఊరకొండ నుంచి అది వెనుదిరిగింది. శంకవరంకత్తిపూడి దాటి మండపం గ్రామ పొలాల వైపు వెళ్లింది. అన్నవరం క్షేత్రం పంపా రిజర్వాయర్ మార్గంలో వెళ్లినట్లు అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. అన్నవరం, తాళ్లపాలెం, మండపం, బెండపూడి వాసులను అధికారులు అప్రమత్తం చేశారు. పొలాల్లోకి వెళ్లిన రైతులు వెంటనే వెనక్కి రావాలని సూచించారు. పులి సంచారం హెచ్చరికలతో అన్నవరం దేవస్థానం, అటవీ, పోలీసు శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. కొండపై భక్తులు అప్రమత్తంగా ఉండాలని మైక్ ద్వారా ప్రచారం చేశారు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గంలో ఒంటరిగా నడిచి వెళ్లొద్దని సూచించారు. ఘాట్ రోడ్డులో ఎక్కడా వాహనాలు నిలపవద్దని హెచ్చరికలు జారీ చేశారు. వసతి గదుల్లో నుంచి రాత్రి వేళల్లో బయటకు రావొద్దని.. భక్తులు, గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
16.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



వంటగ్యాస్ కొరత :మధ్యలో మంట తగ్గించండి
వంటగ్యాస్ కొరత :మధ్యలో మంట తగ్గించండి
ఆహారం మరిగిన తర్వాత మంట తగ్గిస్తే అదే వేడి లోపల ఉండి వంట పూర్తవుతుంది.



## రైతులకు గుడ్ న్యూస్

- ఈ నెల 22న రైతు భరోసా మొదటి విడత నిధులు విడుదల
- మూడు విడతల్లో రైతులకు జమ
- ఈసారి 9 వేల కోట్ల రైతు భరోసా

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రైతు భరోసా విడుదలకు ముహూర్తం ఖరారు అయింది. ఈ నెల 22న రైతుల ఖాతాల్లో నగదు జమ కానుంది. సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి రైతు భరోసా నిధులు సీఎం విడుదల చేయనున్నారు. రైతు భరోసా నిధుల విడుదల పై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులతో చర్చించిన సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు.

**తొలి విడతగా 70 లక్షల మందికి భరోసా ..**
రైతు భరోసాలో భాగంగా తొలి విడతగా మొత్తం 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి ఒక ఎకరం వరకు రైతు భరోసా కింద రూ.3,590 కోట్లు బదిలీ చేయనున్నారు. రెండో విడతగా మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు, ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడతగా మొత్తం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. మూడు విడతల్లో కలిపి మొత్తంగా రైతుల ఖాతాల్లో సుమారు రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ కానున్నాయి.

## ఎస్సీ యువతకు స్వయం ఉపాధి

- ఎస్సీ యువతకు స్వయం ఉపాధి
- సబ్సిడీపై రుణాలు
- - వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
వికారాబాద్ జిల్లా లోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, వికారాబాద్ జిల్లా వారు ఎస్.సి. యాక్షన్ ప్లాన్ 2025 26 కింద రూ.1.00 లక్ష రూపాయల వరకు ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు (90% సబ్సిడీ, రూ.3.00 లక్షల విలువ గల (త్రి చక్ర ఎలక్ట్రికల్ ఆటో (ప్యాసింజర్/గూడ్స్) వాహనాలు (70% సబ్సిడీ) రూ.3.00 నుండి రూ.7.00 లక్షల (రూ.5.00 లక్షల వరకు 60% సబ్సిడీ) విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ వ్యవసాయ అనుబంధ భాగాల యూనిట్‌లను లోన్ల (కింద ప్రకటించడం జరిగింది. వయస్సు 2150 సంవత్సరాలు లు కల అభ్యర్థులు ఉపాధి హామీ పథకాలకు మరియు 2160 సం.లు కల అభ్యర్థులు భూసంబంధ, వ్యవసాయ/సోలార్ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థి సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు మరియు పట్టణ/ మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ.2.00 లక్షలు మించి ఉండరాదు. మీసేవ నుండి పొందిన కులం మరియు ఒక సంవత్సరం లోపు ఆదాయ ధృవపత్రం, ఆధార్ కార్డ్ మరియు ఫుడ్ సెక్యూరిటీ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన దారిద్ర్య రేఖకు దిగువన కల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. కావున అర్హత ఆసక్తి గల షెడ్యూల్డు కులాల అభ్యర్థులు టీజీబీఎంఎంఎస్ ఆన్లైన్ పోర్టల్ https://tgobmmsnew.cgg.gov.in ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నమోదు ప్రక్రియ తేదీ.17.03.2026 నుండి 24.03.2026 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కొరకు జిల్లాలోని ఎస్.సి.కార్పోరేషన్ కార్యాలయం, వికారాబాద్ జిల్లా, రూమ్ నెం.S11&12, రెండవ అంతస్తు, సమీకృత జిల్లా ఆఫీసుల కార్యాలయము, కలెక్టరేటు నందు సంప్రదించగలరు. ఇతర వివరములకు 08416255866 నందు సంప్రదించాలని తెలిపారు.

## ముస్లిం సోదరులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ




**ముద్ర కూకట్‌పల్లి :**
రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బట్టల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్, ఎస్టీఆర్ నగర్ కాలనీలలో గల మసీదుల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లింలకు దుస్తులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. రంజాన్ మాసం క్రమశిక్షణకు, దైవచింతనకు మరియు సోదరభావానికి ప్రతీక అని కొనియాడారు. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ పండుగను ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మనసుతో ఈ కానుకలను అందజేస్తున్నారని తెలిపారు. మసీదులు, ఈద్గాల మరమ్మతులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని, మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కులం, మతం, జాతి అనే భేదం లేకుండా తెలంగాణ ప్రజలందరూ కలిసిమెలసి ఉండాలని, ఈ పవిత్ర ప్రార్థనల వల్ల రాష్ట్రంలో శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

# ఎన్నికల నగారా

- ఏప్రిల్ లో పోలింగ్.. మే 4న ఫలితాలు!
- తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో పోలింగ్‌కు ఏర్పాట్లు
- 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- ఈ 5 రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమలు
- ఆరు రాష్ట్రాల్లో ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం




**ముద్ర, ఢిల్లీ :**
దేశంలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ వెంటనే అమల్లోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. తమిళనాడులో 234, పశ్చిమ బెంగాల్‌లో 294, కేరళలో 140, అస్సాంలో 126 స్థానాలు ఉండగా, పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం దేశవ్యాప్తంగా సుమారు 2.19 లక్షల పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు దాదాపు 25 లక్షల మంది ఎన్నికల అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. ఈ రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్ నెలల్లో వేర్వేరు తేదీల్లో ముగియనుండడంతో ఎన్నికల సంఘం ముందస్తుగా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియను పూర్తి చేసిన ఎన్నికల సంఘం క్షేత్ర స్థాయి పరిస్థితులను సమీక్షించింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి కలిసి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు.

**ఎనిమిది స్థానాల్లో ఉప ఎన్నికలు**
ఇదిలా ఉండగా, ఆరు రాష్ట్రాల్లోని మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గోవా, కర్ణాటక, నాగాలాండ్, త్రిపురా రాష్ట్రాల్లోని ఐదు స్థానాలకు ఏప్రిల్ 9న పోలింగ్ నిర్వహించనుండగా, గుజరాత్ మరియు మహారాష్ట్రలోని మూడు అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. ఈ స్థానాల్లోని సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ ఉప ఎన్నికల ఫలితాలు కూడా మే 4న వెల్లడించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

## ప్రభుత్వ భూమి స్వాధీనం

- 2.34 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్
- రూ. 250 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా




**ముద్ర, హైదరాబాద్:**
రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లోని రాంబాగ్ సర్వే నంబరు 354/1, 354/2, 354/3లలో 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ రూ. 250కోట్ల వరకూ ఉంటుందని అంచనా. చుట్టూ దేవాలయాలు.. మధ్యలో ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమికి ఆనుకుని సిక్కులకు సంబంధించిన సమాధి ఉంది. ఒక వైపు దేవాలయాలకు కేటాయించాలని.. మరో వర్గం సిక్కులకు ఇవ్వాలని స్థానికంగా ఎప్పటి నుంచో వివాదం నెలకొని ఉంది. ఎవరికి వారు తమదంటూ వాధిస్తూ వచ్చారు. ఇటీవల సిక్కులు తమకు ఈ భూమిని కేటాయించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ స్థలం విషయంపై సరైన నిర్ణయం తీసుకోవాలని జనవరి నెల 29న జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఇందుకు గాను 3 నెలల సమయం ఇచ్చింది. ఈ లోగా సిక్కు మతస్తులు 2.34 ఎకరాల చుట్టూ టిన్ షీట్లతో ప్రహరీ నిర్మించి వారి ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో వివాదం తలెత్తింది. ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

**హైడ్రా కమిషనర్ పరిశీలన..**
మీడియాలో వచ్చిన కథనాలతో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ ఇటీవల పరిశీలించారు. ఇరు వర్గాలతో మాట్లాడి.., సంబంధిత పత్రాలను పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం టిన్ షీట్లతో వేసిన ప్రహరీని తొలగించారు. ఆ వెంటనే 2.34 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. అక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా హైడ్రాతో కలసి పోలీసులు, రెవెన్యూ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. సిక్కుల సమాధి ఉన్న స్థలం 366 గజాల స్థలాన్ని వదిలిపెట్టి మిగతా భూమి చుట్టూ ఫెన్సింగ్ శారు. దీంతో అక్కడ సమస్య పరిష్కారమైంది. దశాబ్దాల సమస్యకు హైడ్రా పరిష్కారం చూపడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడిందంటూ కొనియాడారు.

## బీజేపీకి ఎదురెళ్లే ధైర్యం వైసిపికి ఉందా ?



**ముద్ర, హైదరాబాద్:**
2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయం చవిచూసింది. అయితే ఈ ఓటమి వెనుక ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుమానిస్తోంది. జాతీయ స్థాయిలో కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లింది. అయితే ఆ పార్టీ మాట ఎలా ఉంది అంటే కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీని ఏమీ అనడం లేదు. రాష్ట్రంలో కూటమి గెలుపును మాత్రం అనుమానిస్తోంది. దీనిపై రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేసింది. జాతీయ స్థాయిలో కూడా గళం ఎత్తింది. అయితే ఇప్పుడు ఆ పార్టీకి అరుదైన ఛాన్స్ వచ్చింది. ఇదే రకం అనుమానంతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ పై ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి. ఇది నిజంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మంచి అవకాశం. అయితే ఆ పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనేది ఇప్పుడు హాట్ టాపిక్ అవుతుంది.
జాతీయ స్థాయిలో విపక్షాలు స్పీకర్ పై అభిశంసన తీర్మానాన్ని ఉమ్మడిగా పెట్టాయి. అయితే ఇప్పటివరకు ఇదే తరహా ఆరోపణలు చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆశ్రయించాయి. ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాత విధానంలో ముందుకు వెళ్తుందా? లేకుంటే బిజెపి వ్యతిరేక పక్షాలతో చేతులు కలుపుతుందా అన్నది చూడాలి. ఓట్ల లెక్కింపులో తేడాలు ఉన్నాయని.. 51 లక్షల ఓట్లపై స్పష్టత లేదని రాజ్యసభలో ఆ పార్టీ ఎంపీలు నిలదీశారు. ఇప్పుడు అదే ఈసీ పై పక్షపాత వైఖరి, ఎన్నికల మోసం అనే ఆరోపణలతో ఇండియా కూటమి అభిశంసన తీర్మానం నోటీసు ఇచ్చాయి. ఈ తరుణంలో వైసిపి ఆ తీర్మానానికి మద్దతు ఇస్తుందా? లేదా? పొలిటికల్ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది.
ఎన్నికల ఫలితాలు వచ్చి రెండేళ్లు అవుతోంది. ఇప్పటికీ ఈవీఎంల టెంపరింగ్ అంటూ ఆరోపణలు చేస్తూ వస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. బాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరగాలని పదే పదే డిమాండ్ చేస్తోంది. ఎలక్షన్ కమిషన్ తీరుపై నమ్మకం లేదని చెబుతున్న ఆ పార్టీ ఇప్పుడు సీఈసీని తొలగించే ప్రక్రియలో.. భాగస్వామి కాకుంటే మాత్రం ఆ పార్టీ చెప్పే విలువలపై అనుమానాలు, సందేహాలు తలెత్తుతాయి. ఒకవేళ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తే.. లేకుంటే గైర్ హాజరైతే ఇకనుంచి ఎన్నికల అక్రమాలపై నిలదీసే అవకాశమే ఉండదు. తమ ఓటమికి ఈసీనే కారణమని భావిస్తున్నప్పుడు తప్పకుండా ఇప్పుడు విపక్షాలు ఇచ్చిన తీర్మానానికి కట్టుబడి పని చేయాల్సిందే. ఇప్పటికే 193 మంది ఎంపీలు ఈ నోటీసు పై సంతకాలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా దీనికి మద్దతు ఇస్తే కేంద్రం పై ఒత్తిడి పెరుగుతుంది. కానీ వైసిపి అంతటి సాహసం చేస్తుందా? బిజెపికి ఎదురెళ్లే ధైర్యం చేస్తుందా? అలా చేస్తే బీజేపీ ఊరుకుంటుందా? అనేది ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో చర్చ. **–కనపర్తి రవి**




## కార్పొరేట్ శక్తులను అడ్డుకోవాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి
- మార్చి 31న మహిళా రైతుల రాష్ట్ర సదస్సు

**రామన్నపేట, ముద్ర:**
మార్చి 31న రామన్నపేట మండల కేంద్రంలో జరిగే రైతు సంఘం మహిళా రైతుల రాష్ట్ర సదస్సులు జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో రాష్ట్ర సదస్సు గోడపత్రికను ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని విదేశీ స్వదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని అందులో భాగంగానే విత్తన బిల్లు, మార్కెట్ ముసాయిద బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు తీసుకొచ్చారని గతంలో రైతంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఉన్న అవకాశాలను కూడా దూరం చేస్తున్నారన్నారు.ప నాట్లు వేసినప్పుడే ఇవ్వాల్సిన రైతు భరోసాను పంట కోసే వరకు కూడా రావడం లేదని వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జామచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు భూమిపై ఎలాంటి హక్కులు లేకుండా జాయింట్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు పాలకులు వాగ్దానాలు చేస్తున్నారు తప్ప ఆచరణలో అమలు కావడం లేదు, మరోవైపు పెట్టుబడి సహాయం అందకపోవడంతో మహిళా రైతుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కౌలు రైతుల్లో కూడా మహిళలు గణనీయంగా ఉన్నారని పాలు, పండ్లు,కూరగాయలు,చేపల పెంపకం,కోళ్ల పెంపకం లో వీరి పాత్ర కీలకంగా మారిందని వీటిలో కూడా మహిళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకమైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బోయిని ఆనంద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జల్లెల పెంటయ్య,బల్గూరి అంజయ్య సిఐటియు జిల్లా నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం,వేముల సైదులు , భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
16.03.2026 సోమవారం, హైదరాబాద్



**వంటగ్యాస్ కొరత : ఒకేసారి ఎక్కువ వండండి**
మళ్లీ మళ్లీ స్టౌ ఆన్ చేయకుండా ఒకేసారి ఎక్కువగా వండితే గ్యాస్ వినియోగం తగ్గుతుంది.





# విశ్వక్రీడకు వేదికగా భాగ్యనగరం

- గచ్చిబౌలిలో ముగిసిన మహిళల హాకీ సమరం!
- అంతర్జాతీయ వేదికపై అదరగొట్టిన ఆతిథ్యం:
- ఎనిమిది దేశాల జట్ల మధ్య హోరాహోరీగా సాగిన వరల్డ్ క్వాలిఫయింగ్ పోటీలు.
- ముగింపు వేడుకల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.
- మెరిసిన కొత్త ఆస్ట్రోటర్ఫ్.. అదిరిన ఏర్పాట్లు:
- అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం ముస్తాబు..
- లేజర్ షో, సంగీత విభావరితో సందడిగా మారిన ప్రాంగణం.





**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
హైదరాబాద్ నగరం మరోసారి అంతర్జాతీయ క్రీడా వేదికగా నిలిచింది. గచ్చిబౌలి హాకీ స్టేడియంలో నిర్వహించిన మహిళల హాకీ వరల్డ్ క్వాలిఫయింగ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలు రాష్ట్ర ఆతిథ్యం, నిర్వహణ సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పాయి. మార్చి 8న జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులు, అధికారులు, ప్రేక్షకులతో స్టేడియం కిక్కిరిసి క్రీడా పండుగలా మారింది. ఈ క్వాలిఫయింగ్ టోర్నీ ఆగస్టు 14 నుంచి 30 వరకు నెదర్లాండ్స్, బెల్జియంలో జరగబోయే మహిళల హాకీ ప్రపంచకప్‌కు అర్హత సాధించేందుకు నిర్వహించారు. భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ దేశాల జట్లు పాల్గొన్నాయి. ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగి ప్రేక్షకులను అలరించింది. పోటీల నిర్వహణలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. గచ్చిబౌలి స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునిక ఆస్ట్రోటర్ఫ్ ఏర్పాటు చేసి, ప్రేక్షకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. విదేశీ జట్లకు భద్రత, వసతి, రవాణా, వైద్య సేవలు వంటి ఏర్పాట్లు కూడా సమర్థంగా చేశారు. ముగింపు వేడుకలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజహరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. పలువురు క్రీడా ప్రముఖులు కూడా హాజరై ఆటగాళ్లను ప్రోత్సహించారు. ఈ పోటీలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించిన ప్రచారం వల్ల యువత పెద్ద సంఖ్యలో స్టేడియానికి చేరుకున్నారు. టికెట్లు కూడా భారీగా అమ్ముడుపోయాయి. మ్యాచ్‌ల మధ్య నిర్వహించిన లేజర్ షో, సంగీత కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. గచ్చిబౌలిలో విజయవంతంగా జరిగిన ఈ మహిళల హాకీ వరల్డ్ క్వాలిఫయింగ్ పోటీలు తెలంగాణ క్రీడా రంగానికి మరో మైలురాయిగా నిలిచాయి. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## ఫామ్ కోల్పోయినా టీమ్‌ను గెలిపించడం అతనికే సాధ్యం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు విజయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక పాత్ర పోషించాడని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ప్రశంసించాడు. టోర్నీలో బ్యాటర్‌గా ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, సారథిగా జట్టును విజయపథంలో నడిపించాడని పేర్కొన్నాడు. యూఎస్‌ఏపై జరిగిన మ్యాచ్‌లో మాత్రమే సూర్యకుమార్ కీలక ఇన్నింగ్స్ ఆడగా, మిగతా మ్యాచ్‌ల్లో పెద్దగా పరుగులు చేయలేకపోయాడు. అయినప్పటికీ ఆ ఫామ్‌లేమి జట్టుపై ప్రభావం పడనీయకుండా నాయకత్వ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాడు. "ఐసీసీ టోర్నీల్లో కెప్టెన్‌గా ఉన్న అనుభవంతో చెబుతున్నా. వ్యక్తిగతంగా మంచి ఫామ్‌లో ఉంటే జట్టును నడిపించడం సులువు. కానీ పరుగులు చేయలేకపోతున్నప్పుడు కెప్టెన్సీ మరింత ఒత్తిడిగా మారుతుంది. అలాంటి పరిస్థితుల్లో కూడా సూర్యకుమార్ యాదవ్ జట్టును విజయవంతంగా నడిపించాడు" అని పాంటింగ్ పేర్కొన్నాడు. అభిషేక్ శర్మ, సంజు శాంసన్‌లను ఓపెనర్లుగా కొనసాగించడంలో సూర్య తీసుకున్న నిర్ణయం కూడా కీలకమైందని పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా సంజుపై నమ్మకం ఉంచి అతడికి అవకాశాలు ఇవ్వడం జట్టుకు మంచి ఫలితాలు తీసుకువచ్చిందని చెప్పాడు. ఈ మార్పులు జట్టులో ఉత్సాహాన్ని పెంచి చివరకు భారత్‌కు టీ20 ప్రపంచకప్ ట్రోఫీని అందించాయని విశ్లేషించాడు.

## కేకేఆర్ సారథిగా రహానేకే అవకాశం?



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
గత ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయలేక విమర్శలు ఎదుర్కొంది. అజింక్య రహానె నాయకత్వంలోని జట్టు లీగ్‌ను ఎనిమిదో స్థానంలో ముగించింది. దీంతో వచ్చే సీజన్‌కు ముందు జట్టులో నాయకత్వ మార్పు ఉండొచ్చనే ఊహాగానాలు వినిపించాయి. అయితే తాజా సమాచారం ప్రకారం రహానెనే మరోసారి కేకేఆర్ సారథిగా కొనసాగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జట్టు వర్గాల సమాచారం ప్రకారం రహానె అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఫ్రాంచైజీ ఈ విషయంపై అంతర్గతంగా చర్చించి అతడినే కొనసాగించేందుకు మొగ్గు చూపిందని సమాచారం. గత సీజన్‌లో 37 ఏళ్ల రహానె 13 మ్యాచ్‌ల్లో 390 పరుగులు చేసి జట్టులో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ సీజన్‌లో కూడా అతడు వన్‌డౌన్‌లో బ్యాటింగ్ చేయనున్న అవకాశాలు ఉన్నాయి. ఇక గత వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటింగ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసుకుంది. న్యూజిలాండ్ ఆటగాళ్లు ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, రచిన్ రవీంద్రలను జట్టులోకి తీసుకుంది. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను కూడా దక్కించుకుంది. ఈ నలుగురూ టాప్ ఆర్డర్‌లో కీలక పాత్ర పోషించగల ఆటగాళ్లు. అయితే జట్టులో ఇప్పటికే సునీల్ నరైన్, బ్లెస్సింగ్ ముజరబాని, రోవ్‌మన్ పావెల్, మతీశా పతిరణ వంటి విదేశీ స్టార్ ప్లేయర్లు ఉండటంతో తుది జట్టులో ఎవరికి అవకాశం దక్కుతుందో ఆసక్తిగా మారింది. మరోవైపు గాయం కారణంగా హర్షిత్ రాణా ఈ సీజన్‌కు దూరమయ్యే అవకాశమున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై కేకేఆర్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## ఐసీసీ టోర్నీల్లో భారత్ ఆధిపత్యం : రోహిత్ శర్మ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఇటీవలి కాలంలో ఐసీసీ టోర్నీల్లో భారత పురుష, మహిళా జట్లు అద్భుత విజయాలు సాధించాయని మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అన్నారు. రోహిత్, సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో భారత పురుష జట్టు వరుసగా రెండు టీ20 ప్రపంచకప్‌లు గెలుచుకోగా, హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో మహిళా జట్టు తొలిసారి వన్డే ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. ఈ విజయాలు భారత క్రికెట్‌కు కొత్త ఆరంభమని, భవిష్యత్తులో కూడా ఇదే దూకుడు కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో టీమ్ ఇండియా ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. వరుస విజయాలతో త్రివర్ణ పతాకం ప్రపంచ వేదికలపై ఎగురుతోంది. పురుషుల జట్టు వరుసగా రెండు టీ20 ప్రపంచకప్‌లు గెలవడం గొప్ప విషయం. అయితే మహిళా జట్టు సాధించిన వన్డే ప్రపంచకప్ విజయం మరింత ప్రత్యేకం. ముంబయిలో జరిగిన ఫైనల్ మ్యాచ్ చూడటం నాకు ఎంతో ఆనందంగా అనిపించింది. కానీ ఇది కేవలం ప్రారంభం మాత్రమే. ఒకసారి ఈ స్థాయికి చేరుకున్నాక ఇంకా ముందుకు వెళ్లాల్సిందే" అని రోహిత్ పేర్కొన్నారు. యువ ఆటగాళ్లకు కూడా రోహిత్ సూచనలు చేశారు. "జాతీయ జట్టులో అవకాశం ఎప్పుడొస్తుందో చెప్పలేం. కానీ వచ్చినప్పుడు దాన్ని వినియోగించుకునేలా సిద్ధంగా ఉండాలి. మన దేశంలో క్రికెట్‌కు పోటీ చాలా ఎక్కువ. అండర్14 స్థాయి నుంచే కష్టపడాలి. ప్రతిభ ఉన్నా సరే అదృష్టం కూడా కొంత అవసరం. సరైన సమయంలో మన ప్రతిభను గుర్తించే వ్యక్తి ఎదురుపడాలి" అని అన్నారు. అయితే కేవలం అదృష్టంపై ఆధారపడకుండా నిరంతరం శ్రమించడమే విజయానికి కీలకమని రోహిత్ స్పష్టం చేశారు. "ఇది ముంబయి క్రికెటర్లకు మాత్రమే కాదు.. జాతీయ జట్టులో ఆడాలని కలలు కనే ప్రతి ఆటగాడికి వర్తించే విషయం" అని తెలిపారు.

## సంజు దూకుడే మా ప్లాన్: గంభీర్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
టీ20 ప్రపంచకప్‌లో వరుసగా మూడు అర్ధ శతకాలు సాధించిన సంజు శాంసన్ టీమ్ ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రారంభంలో అవకాశాలు రాకపోయినా తనకు అవకాశం వచ్చినప్పుడు మాత్రం ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో అతని దూకుడు జట్టుకు భారీ ఊపు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సంజు శాంసన్‌ను ప్రశంసించాడు. "సంజు శాంసన్ ఎంత ప్రతిభావంతుడో అందరికీ తెలుసు. అతని దూకుడైన ఆటపై ఎలాంటి సందేహం లేదు. ఒకసారి కుదురుకుంటే మొదటి ఆరు ఓవర్లలోనే మ్యాచ్‌ను మా వైపు తిప్పగలడు. జింబాబ్వేతో మ్యాచ్‌కు ముందు జిమ్‌లో మాట్లాడినప్పుడు ఈ మ్యాచ్‌లో నువ్వు ఆడుతున్నావని చెప్పాను. అతను 'సరే, రానివ్వు' అని మాత్రమే చెప్పాడు. మా మధ్య జరిగే సంభాషణలు ఇలా సాధారణంగానే ఉంటాయి" అని గంభీర్ వివరించాడు. సంజును జట్టులోకి తీసుకున్న కారణాన్ని కూడా గంభీర్ వెల్లడించాడు. "టోర్నీ ప్రారంభంలో ముగ్గురు ఎడమచేతి బ్యాటర్లతో ఆడాం. ఆ కూర్పును మార్చేందుకే సంజును తీసుకున్నామని చాలా మంది భావించి ఉంటారు. కానీ అసలు కారణం అది కాదు. టాప్ ఆర్డర్‌లో మరింత దూకుడు కావాలనే ఉద్దేశంతోనే సంజును ఆడించాం. మైదానంలోకి దిగిన వెంటనే వేగంగా ఆడాలనే ప్రణాళికతోనే జట్టును సిద్ధం చేశాం" అని చెప్పారు. అభిషేక్ శర్మ గురించి కూడా గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "2014 ఐపీఎల్ సమయంలో నేనూ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ అయ్యా. ఇప్పుడు అభిషేక్ కూడా అలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నాడు. అభిమానులు స్కోర్లు మాత్రమే చూస్తారు. కానీ కొన్నిసార్లు ఫామ్ లేక కాదు, పరుగులు రావడం ఆలస్యమవుతుంది అంతే. అతని ప్రతిభపై మాకు పూర్తి నమ్మకం ఉంది" అని గంభీర్ పేర్కొన్నారు.







## ది హండ్రెడ్ లీగ్‌లో పాక్ క్రికెటర్‌పై వివాదం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఇంగ్లాండ్‌లో జరిగే ది హండ్రెడ్ లీగ్‌కు సంబంధించిన ఓ నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు కొనుగోలు చేయడం వివాదాస్పదంగా మారింది. ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యమే సన్‌రైజర్స్ లీడ్స్ జట్టును కూడా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ఆటగాడిని ఎలా తీసుకుంటారని కొందరు విమర్శలు వ్యక్తం చేశారు. అయితే ఈ ఒప్పందానికి తమకు ఎలాంటి సంబంధం లేదని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు. ఇక అబ్రార్ అహ్మద్ ఈ సీజన్‌లో ది హండ్రెడ్ లీగ్‌లో ఆడతాడా లేదా అన్నది అనుమానంగా మారింది. ఇప్పటి వరకు అతడికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) రాలేదు. అదే సమయంలో పాకిస్థాన్ జట్టు వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడేందుకు సిద్ధమవుతోంది. జాతీయ జట్టు బాధ్యతలు ఉన్న నేపథ్యంలో అబ్రార్‌కు ఎన్‌వోసీ ఇవ్వకూడదనే ఆలోచనలో పాక్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు సమాచారం. అబ్రార్ తరఫున అతడి ఏజెంట్ ది హండ్రెడ్ వేలంలో పేరు నమోదు చేశాడు. పీసీబీతో మంచి సంబంధాలు ఉన్నందున అనుమతి వస్తుందనే ఆశతో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అంతర్జాతీయ షెడ్యూల్ కారణంగా ఈసారి లీగ్‌లో అతడు ఆడే అవకాశాలు సగం సగంగా ఉన్నాయని పాక్ క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది ది హండ్రెడ్ లీగ్ జులై 21 నుంచి ఆగస్ట్ 16 వరకు జరగనుంది. మరోవైపు వెస్టిండీస్ పర్యటనకు పాకిస్థాన్ జట్టు జులై 15న వెళ్లనుంది. ఆగస్ట్ 7 వరకు రెండు టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అబ్రార్ అహ్మద్ లీగ్‌లో పాల్గొంటాడా లేదా అన్నది పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిర్ణయంపైనే ఆధారపడి ఉంది

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 16.03.2026
www.mudranews.in | @mudranews



**వంటగ్యాస్ కొరత :**

స్టౌ లీకేజీలు చెక్ చేయండిగ్యాస్ లీకేజీ ఉంటే గ్యాస్ వృథా అవుతుంది. పైప్, రెగ్యులేటర్‌ను తరచుగా పరీక్షించడం అవసరం.



## 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం శ్రీలీల భారీ రెమ్యూనరేషన్



టాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత డిమాండ్ ఉన్న హీరోయిన్లలో శ్రీలీల ఒకరు. రామ్, నితిన్, మహేశ్ బాబు వంటి స్టార్ హీరోలతో కూడా నటిస్తూ బిజీగా మారింది. అలాగే 'పుష్ప 2'లో అల్లు అర్జున్‌తో చేసిన స్పెషల్ సాంగ్‌తో కూడా ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆమె నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 19న విడుదలకు సిద్ధమవుతోంది. పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో శ్రీలీలతో పాటు రాఖీ ఖన్నా మరో హీరోయిన్‌గా కనిపించనుంది. పవన్ కల్యాణ్‌తో ఆమె కలిసి నటించడం ఇదే మొదటిసారి. ఈ సినిమా కోసం శ్రీలీల దాదాపు రూ.2.5 నుంచి 3 కోట్ల వరకు పారితోషికం తీసుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గతంలో 'జూనియర్' కోసం రూ.4 కోట్లు, అలాగే రవితేజతో చేసిన 'మాస్ జాతర' కోసం సుమారు రూ.3 కోట్లు తీసుకున్నట్టు సమాచారం. దీంతో టాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న యువ

## ఉస్తాద్ భగత్ సింగ్ 'ప్రీ రిలీజ్ ఈవెంట్'

**- పవన్ మూవీకి హైప్**



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ప్రీ–రిలీజ్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. పవన్ తోపాటు వచ్చిన అతిథుల ప్రసంగాలతో సినిమాపై కావాల్సినంత హైప్ వచ్చేసింది. ప్రీ రిలీజ్ ఈవెంట్ యూసుఫ్ గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఘనంగా జరిగింది. స్టేడియం చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమలు ఉన్నాయి. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు 1వ బెటాలియన్ పోలీస్ గ్రౌండ్ లో జరి గింది. పెద్ద సంఖ్యలో జనాలు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ నుండి స్టేడియం వైపు వచ్చే ట్రాఫిక్ ను కృష్ణ నగర్ జంక్షన్ వద్ద శ్రీ నగర్ కాలనీ, పంజాగుట్ట వైపు మళ్లిస్తారు. మైత్రివనం జంక్షన్ నుండి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, మాదాపూర్ వైపు వెళ్లే వాహనాలను యూసుఫ్ గూడ బస్తీ వద్ద ఆర్బీఐ క్వార్టర్స్, కృష్ణ నగర్ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు మళ్లిస్తారు.

జనకమ్మతోట, యూసుఫ్ గూడ వద్ద మెట్రో పార్కింగ్, సవేరా ఫంక్షన్ హాల్, మహమూద్ ఫంక్షన్ హాల్ వద్ద సందర్శకుల పార్కింగ్ ఏర్పాటు చేశారు. పౌరులు ట్రాఫిక్ సూచనలను పాటించాలని, పోలీసులతో సహకరించాలని సూచించారు


## 50 ఏళ్ల ప్రయాణం ఊహించలేదు : మోహన్ బాబు



సినీ ఇండస్ట్రీలో తన ప్రయాణం ఇంత కాలం కొనసాగుతుందని తాను మొదట్లో ఊహించలేదని ప్రముఖ నటుడు మోహన్ బాబు తెలిపారు. మోహన్ బాబు యూనివర్సిటీ 34వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తన సినీ ప్రయాణంలోని అనుభవాలను గుర్తు చేసుకున్నారు. "1975 నవంబర్ 22న నా తొలి సినిమా 'స్వర్గం నరకం' విడుదలైంది. అప్పట్లో నేను ఏడాది పాటు మాత్రమే సినిమాల్లో ఉంటానేమో, తర్వాత అవకాశాలు తగ్గిపోతే నా గ్రామానికి వెళ్లిపోవాల్సి వస్తుందేమో అనుకునేవాడిని. కానీ కాలక్రమంలో ప్రేక్షకుల ఆదరణతో నా ప్రయాణం కొనసాగింది. ఈ 50 ఏళ్లలో దాదాపు 560 సినిమాల్లో నటించాను. ఇప్పటికీ కొత్త అవకాశాలు వస్తూనే ఉన్నాయి. తల్లిదండ్రుల ఆశీస్సులు, ప్రేక్షకుల ప్రేమ వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను" అని మోహన్ బాబు అన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన కొన్ని సూచనలు చేశారు. మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారు. వారి ఆశలను నెరవేర్చేలా కష్టపడాలి" అని చెప్పారు.

## దురంధర్ రికార్డుల వేట..



సినిమా విడుదలకు ఇంకా కొన్ని రోజులు ఉండగానే 'దురంధర్ ది రివెంజ్' రికార్డుల దిశగా దూసుకెళ్తోంది. బుక్ మై షోలో ప్రస్తుతం 'దురంధర్', 'దురంధర్ ది రివెంజ్' రెండు సినిమాలు ట్రెండింగ్‌లో ఉండటం విశేషం. సీక్వెల్ విడుదలకు ముందు ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచేందుకు మొదటి భాగాన్ని వెయ్యికి పైగా స్క్రీన్లలో మళ్లీ విడుదల చేశారు.

వంద రోజుల గ్యాప్‌లోనే మళ్లీ రీ–రిలీజ్ చేసినప్పటికీ 'దురంధర్'కు మంచి స్పందన లభిస్తోంది. గత 24 గంటల్లోనే ఐదువేలకుపైగా టికెట్లు అమ్ముడవడం గమనార్హం. సాధారణంగా రీ–రిలీజ్ సినిమాలకు అరుదుగా కనిపించే స్పందన ఇది.

ఇక 'దురంధర్ ది రివెంజ్' విషయానికి వస్తే రోజుకు సగటున నలభై వేలకుపైగా టికెట్లు బుక్ అవుతున్నాయి. కౌంటర్ బుకింగ్స్, ఇతర యాప్‌ల అమ్మకాలు ఇందులో లెక్కలో లేవు. భారీ పోటీగా నిలిచిన 'ఉస్తాద్ భగత్ సింగ్' ఉన్నప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ సినిమాపై మంచి క్రేజ్ కనిపిస్తోంది. సీక్వెల్ చూడటానికి ముందు మొదటి భాగాన్ని మళ్లీ చూసేలా నిర్మాతలు వేసిన వ్యూహం పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నగరాల్లో దీనికి మంచి స్పందన లభిస్తోంది.

రిలీజ్‌కు ఇంకా ఐదు రోజులు ఉండగానే 'దురంధర్ ది రివెంజ్' ఈ స్థాయిలో బుకింగ్‌లు సాధించడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఇప్పటికే ప్రీమియర్ల ద్వారా నలభై కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం మొదటి షో పడే సమయానికి మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. దర్శకుడు ఆదిత్య ధార్ మాత్రం ఈ సినిమాకు ప్రత్యేకంగా ప్రమోషన్లు చేయడం లేదని తెలుస్తోంది. తెలుగు డబ్బింగ్ వెర్షన్ ప్రీమియర్ కోసం హైదరాబాద్ రావాలని చేసిన అభ్యర్థనకు కూడా ఆయన సున్నితంగా నిరాకరించినట్లు సమాచారం.

## ఆరెంజ్ డ్రెస్‌లో మాళవిక మెరుపులు




దక్షిణాది సినీ ప్రేక్షకుల్లో తన అందం, స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి మాళవిక మోహనన్ మరోసారి తన ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది. ఈ ఏడాది ప్రారంభంలో ఆమె నటించిన 'ది రాజా సాబ్' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితం సాధించలేదు. అయినప్పటికీ మాళవిక వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది.

ఇటీవల మాళవిక తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫొటోలు అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. ఆ ఫొటోలలో ఆమె ఆకర్షణీయమైన ఆరెంజ్ రంగు బాడీ ఫిట్ డ్రెస్‌లో కనిపించింది. ఆ డ్రెస్ ఆమె స్టైల్‌ను మరింత అందంగా చూపిస్తోంది. సహజంగా వదిలేసిన వేవీ హెయిర్, స్టేట్‌మెంట్ ఈయరింగ్స్, గోల్డ్ బ్రేస్‌లెట్‌తో ఆమె లుక్‌కు మరింత శోభ పెరిగింది. పాతకాలపు వీధి నేపథ్యంలో, నీలం రంగు చెక్క తలుపు దగ్గర నిలబడి మాళవిక ఇచ్చిన పోజులు ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆధునిక ఫ్యాషన్‌తో పాటు రస్టిక్ బ్యాక్‌డ్రాప్ కలయిక ఈ ఫొటోలకు ఆర్టిస్టిక్ టచ్‌ను ఇచ్చింది.

అదే సమయంలో ఆమె ధరించిన పర్పుల్ హీల్స్ ఆరెంజ్ డ్రెస్‌కు కాంట్రాస్ట్‌గా కనిపిస్తూ మొత్తం లుక్‌ను మరింత స్టైలిష్‌గా మార్చాయి. మొత్తంగా ఈ ఫొటోషూట్‌లో మాళవిక మోహనన్ తన ఫ్యాషన్ సెన్స్‌తో మరోసారి అభిమానులను ఆకట్టుకుంది

## ప్రియదర్శిని చిక్కుల్లో పడేస్తున్న 'సుయోధన'



ప్రియదర్శి, ద్రిషిక చందర్ జంటగా వైఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సుయోధన'. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా టీజర్‌ను ఆదివారం విడుదల చేశారు.

టీజర్‌ను బట్టి చూస్తే కథలో ఆసక్తికరమైన మలుపులు ఉండనున్నట్లు తెలుస్తోంది. దుర్యోధనుడిలా ప్రవర్తించే ఓ వ్యక్తి కారణంగా ప్రియదర్శి పాత్ర ఎన్నో సమస్యల్లో చిక్కుకుంటుంది. అతడిని సుయోధనుడు ఎలా ఇబ్బందులకు గురిచేస్తున్నాడో టీజర్‌లో చూపించారు. ఆ సమస్యల నుంచి హీరో ఎలా బయటపడతాడు అన్నదే సినిమా ప్రధాన కథగా కనిపిస్తోంది. ఇంటెన్స్ సన్నివే శాలు, ఆసక్తికరమైన నేపథ్యంతో రూపొందిన ఈ టీజర్ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. త్వరలో ఈ చిత్ర విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com